J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 23 10.11.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# పవన్ చెవిలో.. 'కమలం' పువ్వు

## తమ రాజకీయ ఎత్తుగడలో పవన్‌ని పావుని చేస్తున్న బీజేపీ

- కింగ్ కాలేకపోయినా.. కనీసం కింగ్‌మేకరన్నా అవుతాడన్నది జనసైనికుల ఆశ!
- ఈ మెగా హీరో రాజకీయాలలో కూడా 'పవర్' స్టార్ అవుతాడా.. లేక కేవలం.. పొలిటికల్ కెమెడియన్‌గా మిగిలిపోతాడా?

*తెలంగాణలో జనసేనకి బీజేపీతో పొత్తు. 8 సీట్లలో కమలంతో కలిసి ఆ పార్టీ పోటీ. అక్కడ తెలుగుదేశానికి ఎవరితో పొత్తు లేదు. ఆ పార్టీ అక్కడ పోటీ కూడా చేయడం లేదు. ఆంధ్రాలో మాత్రం పవన్ టీడీపీతో కలిసి ఎన్నికలకి వెళ్తారు. తెలుగుదేశం పెద్దలు తనకి ఎన్ని సీట్లు ఇస్తారో తెలియదు. ఇక ఆంధ్ర రాజకీయాల విషయానికొస్తే ఇక్కడ బీజేపీకి, టీడీపీకి ఇంకా సయోధ్య కుదరలేదు. కేంద్ర పెద్దలు మాత్రం ఇంకా జగన్ పక్షపాతిగానే వ్యవహరిస్తున్నారు. చంద్రబాబుని నమ్ముకోవడంకన్నా జగన్ కేసులపై ఆధారపడడమే తమకి ఉత్తమమన్నది వారి భావన. ఇలాంటి తరుణంలో పవన్ రాజకీయ భవిష్యత్ ఏమిటన్నది ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న చర్చ. సినిమాలలో హీరోగా రాణించిన పవర్ స్టార్, రాజకీయాలలో కింగ్ కాలేకపోయినా... కనీసం కింగ్ మేకర్‌గానన్నా అవతరిస్తారా లేక కేవలం పొలిటికల్ కెమెడియన్‌గా మిగిలిపోతారా..? అన్నది సర్వత్రా వినిపిస్తున్న ప్రశ్న.*




గత పది సంవత్సరాలుగా జనసేన అనే పార్టీని నడుపుతున్న పవన్ కళ్యాణ్‌కు 'నిలకడ ఉండదు' అన్న విమర్శలో నిజం లేకపోలేదన్నది మరోసారి రుజువైంది. తనకు కులం లేదని ఆయన తరచూ చెప్తూనే ఉంటారు. కానీ, కాపు కుల జనాభా అధిక సంఖ్యలో ఉండే నియోజకవర్గాలనే ఎంచుకుని ఎన్నికల బరిలో దిగుతారు. 2019 ఎన్నికల్లో ఆయన పోటీచేసిన భీమవరం, గాజువాక రెండు నియోజకవర్గాలలోనూ కాపు ఓటర్ల సంఖ్య బాగా అధికం అన్న విషయం బహిరంగ రహస్యం. ఈసారి కూడా కాపు జనాభా అధికంగా ఉన్న ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణ, గుంటూరుపై ఆయన ఎక్కువగా దృష్టిసారిస్తున్నారన్నది ఆ పార్టీ వర్గాల నుండి వస్తున్న సమాచారం. ఇది, పవన్ కళ్యాణ్‌కు సంబంధించిన సామాజిక కోణం.

ప్రస్తుత రాజకీయ విలువల వలువలను నేతలు ఊడదీసేస్తున్న పరిస్థితులలో, పవన్ కళ్యాణ్‌ను తప్పు పట్టలేమని.. అవసరాన్ని, అవకాశాన్ని బట్టి రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలి కాబట్టి పవన్ కళ్యాణ్ ఆలోచనని తప్పు పట్టనవసరం లేదని ఒక రాజకీయ విశ్లేషకుడి అభిప్రాయం. తెలంగాణలో

10లో






# ప్రపంచానికే ఆదర్శం.. భారతీయ జీవన విధానం

## జేఎన్టీయు ప్రొఫెసర్ రంగజనార్ధన్

భారతీయ జీవన విధానం ప్రపంచానికే ఆదర్శమని జేఎన్‌టియు ఉపకులపతి ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన్ చెప్పారు. అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ (ఏబిఆర్ఎస్ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ–వాయిస్ ఆఫ్ అనంతపురం అకడమీషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో 'భారతీయ జీవన విధానం–నేటి సమాజంపై ప్రభావం' అనే అంశంపై పెద్దఎత్తున చర్చాగోష్టి జరిగింది. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ గోష్టిలో జేఎన్‌టియు ఉపకులపతి ప్రొఫెసర్ రంగజనార్ధన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతీయ జీవనవిధానంలోని వైశిష్ట్యాన్ని వివరించారు. నేటి ఆధునిక సమాజంలో భారతీయ జీవన విధానం, అలవాట్లు, ఆలోచనలు, సంప్రదాయాలు మొదలైనవి విద్యార్థులను మంచిపౌరులుగా తీర్చిదిద్దటంలో ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంగినేని రంగనాథ్, మహిళా ప్రముఖ్ కుమారి షర్మిల రామయ్య మాట్లాడారు. ప్రపంచంలో మొట్టమొదటిగా విశ్వవిద్యాలయాలను మనదేశంలోని నలంద, తక్షశిల, అమరావతి మొదలైన ప్రాంతాలలో వందలాది సంవత్సరాల క్రితమే ఏర్పాటు చేశారని, భారత్‌కు ఇదెంతో గర్వకారణమని ముఖ్యవక్తగా పాల్గొన్న ఆ సంఘం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంతా లక్ష్మణ్‌జీ అన్నారు. కాలక్రమంలో నేటి విద్యార్థులు పాశ్చాత్య ప్రభావం చేత తమ మూలాలను మరిచిపోయి అనేకమైన వ్యసనాలకు లోనవుతున్నారని, ప్రపంచంలో అనేక దేశాలు మన వేదాలలో, ఉపనిషత్తులలో, యోగాలో ఆయుర్వేదంలో ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకొని జీవనవిధానాన్ని మెరుగుపరుచుకుంటుండగా మనదేశంలో విద్యార్థులు మాత్రం వాటి యొక్క విలువ తెలుసుకోలేకపోతున్నారని, కావున నేటి విద్యార్థినీ విద్యార్థులు అందరూ భారతీయ జీవన విధానం పట్ల, కుటుంబ విలువలు, వసుదైక కుటుంబం, శాంతి, సౌభాగ్యం మొదలైన మంచి లక్షణాల బాటలో నడవాలని తద్వారా భారతదేశాన్ని ప్రపంచానికి విశ్వగురువుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణ మరియు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పన్ను బకాయిలు చెల్లించండి

పన్ను బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. ఇటీవల ఆయన ఆస్తిపన్ను, మంచినీటి కుళాయిల పన్నులు చెల్లించడంలో కాలయాపన చేస్తున్న పలు వాణిజ్యభవనాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పన్ను బకాయిదారులు బాధ్యతగా బకాయిలను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని, గడువులోగా పన్నులు చెల్లించకుంటే అపరాధ రుసుంతో సహా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

## సైన్స్ క్విజ్ పోటీలకు

# దరఖాస్తులు పంపండి



భారతీయ విజ్ఞానమండలి, రాష్ట్ర సాంకేతిక మండలి సంయుక్తంగా నిర్వహించే 'కౌశల్ సైన్స్ క్విజ్ పోటీల'కు విద్యార్థులు దరఖాస్తులు పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి గంగాభవాని కోరారు. ఆమేరకు ఇటీవల ఆమె తమ కార్యాలయంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్, ఉపాధ్యాయులతో కలిసి క్విజ్‌పోటీల గోడ పత్రాలు ఆవిష్కరించారు. ఈ పోటీలకు అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులను పంపాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. నవంబరు 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

# జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

## - సిపిఎం నాయకుల డిమాండ్




వర్షాభావ పరిస్థితుల వల్ల సాగునీరు కరువై రైతులు పంటలపై ఆశలు వదులుకున్నారని, రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి వెంటనే జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. ఇటీవల నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ, జిల్లాలో రైతులు కరువుతో బాధలు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కటారి అజయ్ కుమార్, తుళ్ళూరు గోపాల్, మూలి వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లమీదకి పశువులను వదిలితే ఎలా?

## - యజమానులకు జరిమానాలు వేయాలన్న కమిషనర్



నెల్లూరు నగరంలో రోడ్లపై విచ్చలవిడిగా పశువులు సంచరిస్తుండడం సర్వసాధారణమైపోయింది. అవి రోడ్లమీద చెత్తాచెదారాన్ని, పారేసిన ఆహారపదార్థాలను తినేయడం వల్ల నానారకాల అనారోగ్యాలకు గురవుతున్నా, వాటివల్ల పాదచారులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉన్నా సంబంధిత యజమానులు పట్టించుకోవడం లేదు. కూరగాయల మార్కెట్, ట్రంకురోడ్డు, మద్రాసుబస్టాండ్, విఆర్‌సి సెంటర్, కరెంటాఫీసు సెంటర్, పొదలకూరు రోడ్డు, వేదాయపాళెం ఇలా ఒకచోటనేమిటి..ఎక్కడ చూసినా రాత్రీపగలు అవి సంచరిస్తూనే ఉంటాయి. యజమానులు పట్టించుకోకపోవడంతో మురుగు నీళ్ళు, చెత్తకుప్పల్లో ఎంగిలాకులు, వాడిపారేసిన ప్లాస్టిక్‌కవర్లను మింగేసి కడుపునొప్పితో అల్లాడుతుంటాయి. వాటివల్ల కొన్నిచోట్ల రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని, వెంటనే వాటిని నియంత్రించాలని అధికారులు ఎంతోకాలంగా చెప్తూనే ఉన్నారు. కానీ, పట్టించుకునేవారేరీ?.. ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ స్వయంగా రోడ్లమీదకి వచ్చి పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలిస్తూ, పశువులు గుంపులుగా రోడ్లమీద తిరుగుతుండడాన్ని గమనించారు. సంతపేట నాలుగుకాళ్ళ మండపం వంటి కూడలి ప్రాంతాల్లో ఎక్కువగా పశువులు రోడ్లపై ఉండడాన్ని ఆయన చూశారు. ఇలా రోడ్లపై పశువులను వదిలితే ఎలా?.. అని అక్కడివారిని ప్రశ్నించారు. వాటిని నియంత్రించకుంటే యజమానులకు భారీ జరిమానాలు విధించాలంటూ సిబ్బందిని ఆదేశించారు. చూద్దాం.. ఇకనైనా యజమానులు స్పందిస్తారేమో!




## బాల్య వివాహాల

# నివారణకు కమిటీ

బాల్యవివాహాలు నివారించేందుకు, ఆ మేరకు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తోటపల్లి గూడూరు ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు. కమిటీ ఛైర్మన్‌గా తాను, కో– ఛైర్మన్‌గా తహశీల్దార్ లావణ్య, కన్వీనర్‌గా సీడీపీఓ రాజ్యలక్ష్మి ఉంటారని పేర్కొన్నారు. సభ్యులుగా మండల పరిషత్ అధ్యక్షునితో పాటు జడ్పీటీసీ శేషమ్మ, ఎస్ఐ జంపాని శివకుమార్, పీహెచ్‌సి వైద్యులు నరసింహం, నరేంద్ర, ఎంఇఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం శైలజ ఉంటారని తెలిపారు.

## శబరిమలకు, అరుణాచలానికి.. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

శబరిమల యాత్రకు వెళ్ళే భక్తులకు, అరుణాచలంకు వెళ్ళే యాత్రికులకు నెల్లూరు నుంచి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. తక్కువ చార్జీలతో అద్దెబస్సులు కూడా ఉంటాయి. శబరిమలకు నవంబరు 16, 18, 22, 23, 25, 27, 29, 30 తేదీల్లో, అదేవిధంగా డిసెంబరు 2,4,7, 8, 10, 14, 15, 16, 17, 22, 23, 28, 29 తేదీల్లో, జనవరి 3, 6 తేదీల్లో నెల్లూరు ఆర్టీసి ప్రధాన బస్టాడు నుంచి ఉదయం 10 గంటలకు ప్రత్యేక బస్సు బయలుదేరు తుందని, మార్గమధ్యంలో కాణిపాకం, భవాని, ఎరిమేలి, పంబ ప్రాంతాలకు వెళ్ళి, తిరిగి వచ్చేటప్పుడు కుర్తాళం, మధురై, చెన్నై, మేల్మరువత్తూరులను సందర్శించే అవకాశం ఉంటుందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. 5 రోజుల పాటు ఈ యాత్రను ప్రత్యేక ప్యాకేజీ కింద ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీలో రూ.4వేలు, అల్ట్రా డీలక్స్ బస్సులో రూ,3,900, ఎక్స్‌ప్రెస్ బస్సులో రూ. 3,300 వంతున టిక్కెట్ చార్జీ ఉంటుంది. కార్తీకపున్నమిని పురస్కరించుకుని అరుణాచలానికి వెళ్ళే భక్తుల కోసం నవంబరు 26వ తేదీ ఉదయం 10 గంటలకు బస్సు ఉంటుంది. వెళ్ళడానికి, తిరిగి వచ్చేందుకు కలిపి టిక్కెట్ చార్జీ ఒక్కొక్కరికి రూ.1200 ఉంటుందని, భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్టీసీ వర్గాలు కోరుతున్నాయి.

## డిసెంబరు 16న భగవద్గీత పోటీలు

గీతాజయంతి సందర్భంగా నెల్లూరు టౌన్‌హాలులో టీటీడీ ఆధ్వర్యంలో డిసెంబరు 16వ తేదీన భగవద్గీత శ్లోకాల పోటీ నిర్వహిస్తామని హిందూ ధర్మప్రచార పరిషత్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్–సీనియర్‌ల విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు వివరాలకు 9491565284 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

## కిడ్నీ బాధితురాలికి చేయూత

ఉదయగిరి మండలంలోని వెంగళ రావునగర్ బెస్త కాలనీకి చెందిన గువ్వల రమణమ్మ రెండు కిడ్నీలు చెడిపోయి చికిత్సకు డబ్బులులేని స్థితిలో ఉండడాన్ని తెలుసుకున్న స్థానిక జిఎంసి ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, తమ ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, గఫూర్ సాహెబ్‌ల ద్వారా ఇటీవల ఆమె కుటుంబ సభ్యులకు పది వేలు ఆర్థికసాయాన్నందించారు. అందుకు సహకరించిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాముల రమణయ్యకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలల తనిఖీ

రాపూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలను ఈనెల 6న డెప్యూటీ డీఇఓ ప్రసన్నలక్ష్మి ఆకస్మికంగా తనిఖీచేసి, రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్నభోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరాతీశారు. 10వ తరగతి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# కరువు తీవ్రతను పట్టించుకోని సీఎం

### టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి



'రాష్ట్రంలో కరువు తాండవిస్తోంది. సాగునీటికి, తాగునీటికి కొరత ఏర్పడింది. ఆహారధాన్యాల ఉత్పత్తి ఘోరంగా పడిపోయింది.. రైతులు కష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే కీలక శాఖల మంత్రులేమో పత్తాలేరు, సీఎం జగన్ అసలు పట్టించుకోవడం లేదు. ఇదెక్కడి అన్యాయం'.. అంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, నాయకులు పత్తిపాటి పుల్లరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులతో కలసి నంద్యాల జిల్లా బనగానపల్లి నియోజకవర్గంలోని కరువు ప్రభావిత ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, కేబినెట్ సమావేశం జరిగినా కరువు గురించి సమీక్షించలేరా అంటూ మంత్రులనుద్దేశించి అన్నారు. వర్షాభావంతో సుమారు 30 లక్షల ఎకరాల్లో పంట సాగు నిలిచిపోయింది. రూ.20వేల కోట్ల విలువైన దిగుబడి ఆగిపోయింది. 60శాతం లోటు వర్షపాతంతో రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఘోరంగా ఉంది. రైతులు నిలువునా నష్టపోతుంటే కేంద్రాన్ని అడిగి నిధులు తెచ్చే దమ్ము లేకుండా పోయిందా?.. అని ఆయన ప్రశ్నించారు. ప్రధాన ప్రాజెక్టులన్నింటినీ మూలనపెట్టేశారని, ఎన్నికల కోసం కలెక్షన్ తప్ప రాష్ట్రం, ప్రజలు, రైతుల బాధలు వంటివేమీ సీఎం జగన్‌రెడ్డికి పట్టడం లేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా మేలుకుని రాష్ట్రంలోని 470 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాలన్నారు. పత్తికి ఎకరాకు రూ.50 వేలు, మిరపకు రూ.50 వేలు, పొగాకుకు రూ.30 వేలు వంతున పరిహారం చెల్లించాలని, మొక్కజొన్న రైతులను కూడా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# వరిగొండకు.. ఇక నిరాటంకంగా విద్యుత్

- 11 కేవీ విద్యుత్ ఫీడర్ బ్రేకర్ ప్రారంభం



తోటపల్లి గూడూరు మండలంలోని వరిగొండ గ్రామంలో ఈనెల 8న 11 కే.వీ విద్యుత్ ఫీడర్ బ్రేకర్ ప్రారంభమైంది. ఆంధ్ర ప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఫీడర్ బ్రేకర్‌కు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిలతో కలిసి ఆయన ఆ ఫీడర్ బ్రేకర్‌కు స్విచ్ ఆన్ చేశారు. ఈ ఫీడర్‌ను రూ.56.75 లక్షలతో ఏర్పాటుచేశారని, దీని ద్వారా వరిగొండ, రావూరువారికండ్రిగ గ్రామాలకు నిరంతరం నిరాటంకంగా విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయా డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డెప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి రుణాలపై ప్రత్యేక అధికారుల సమీక్ష

డ్వాక్రా సంఘాలకు స్త్రీనిధి రుణాల మంజూరు విషయమై ఇటీవల మనుబోలులో సమావేశం జరిగింది. స్త్రీనిధి ప్రత్యేక అధికారుల బృందం పాల్గొని రుణాల మంజూరుకు సంబంధించి వివిఓలకు అవగాహన కల్పించారు. రుణాల బకాయిలపై సమీక్షించారు. గుంటూరు ఏజీఎం చెన్నకేశవులు, విజయనగరం జిల్లా స్త్రీనిధి సీనియర్ మేనేజరల్ సుధాకర్, నెల్లూరుజిల్లా మేనేజర్లు హరీష్, శ్రీధర్, ఏపీఎం వనజాక్షి పాల్గొన్నారు.



## సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 11

# అమ్మ, చెల్లెమ్మల విషయంలో అసలేం జరిగింది?

ప్రజా నాడెరిగిన నాయకుడిగా, బాధ్యతలు ఎరిగిన కుటుంబ పెద్దగా, మంచితనం, మానవత్వం మూర్తీభవించిన వ్యక్తిగా, పరిపూర్ణ పరిపక్వత కలిగిన మహామనీషిగా సమాజంలో గుర్తింపు పొంది, నిన్నటి తరానికి, నేటి తరానికి, రేపటి తరానికి గుర్తుండిపోయే నేతగా ఖ్యాతి చెందిన మహనీయులు దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి. ఆయనకి తనని నమ్ముకున్నవాళ్లంటే ప్రాణం. తన అనుచర గణమంటే ఇష్టం. తనకోసం తపించేవారంటే మహా ప్రేమ.

సామాన్య ప్రజలంటేనే అంతటి మమకారం కలిగిన ఆ అమృతమూర్తికి, ఇక తన కుటుంబమంటే ఎంత ప్రేమ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. తాను రాజకీయాలలో తలమునకలై నిత్యం ప్రజలతో మమేకమై క్షణం తీరికలేకుండా ఉన్నా, ఆయన కుటుంబాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. తన భార్యాపిల్లలతో పాటు తన తోడబుట్టిన వాళ్ళ బాగోగులను కూడా పట్టించుకునేవారు. తన కుటుంబానికి తానే పెద్దదిక్కన్న తరహాలో వ్యవహరించేవారు.

అలాంటి మానవీయ మనస్తత్వం కలిగిన మహానేత కుటుంబం ఇప్పుడు వీధుల పాలయ్యింది. రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆయన రాజకీయ వారసుడు జగన్ మోహన్‌రెడ్డి స్థాపించిన పార్టీకి గౌరవాధ్యక్షురాలుగా విజయమ్మ బాధ్యత తీసుకుంది. కొడుకుకి అండగా ప్రజాక్షేత్రంలో నిలచింది. పదహారు నెలలు జైల్లో ఉన్న అన్నకి తోడుగా చెల్లెమ్మ షర్మిల మూడువేల కిలోమీటర్లకుపైగా పాదయాత్ర చేసింది. 'జగనన్న వదిలిన బాణం'గా తనకి తాను చెప్పుకుంటూ అన్న తిరిగొస్తాడన్న ధైర్యాన్ని జనంలో నింపుతూ, వై.ఎస్. కుటుంబం మొత్తం ప్రజలకోసమే జీవిస్తుందన్న భరోసాని జనానికి కల్పించింది. అలాంటి అన్యోన్యత కలిగిన కుటుంబం ఇప్పుడు ఎవరికి వారే యమునా తీరే... అన్నట్లుగా తయారయ్యింది. అనూహ్యమైన విజయాన్ని సాధించి 175కి గాను 151 సీట్ల మెజారిటీతో ఆంధ్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే కుటుంబ కలహాలు బహిర్గతమయ్యాయి. ఇంటి గుట్టు రచ్చకెక్కింది.

### తొందరపాటుతో తప్పటడుగులు వేస్తూ వచ్చిన షర్మిల!

అన్న మీద కోపంతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి స్టూడియో మెట్లెక్కి రాజశేఖరరెడ్డికి బద్ధశత్రువైన వేమూరి రాధాకృష్ణకి ఇంటర్వ్యూ ఇచ్చారు షర్మిల. ఈ సంఘటన యావత్ రాజశేఖరరెడ్డి అభిమానులను మొత్తం బాధపెట్టింది. అది షర్మిల వేసిన మొదటి తప్పటడుగు. అన్న ఆంధ్రాలో అధికార పగ్గాలు చేపడితే, తాను తెలంగాణలో చక్రం తిప్పుతానంటూ ఆమె వైఎస్సార్‌టీపీ పేరుతో పార్టీ పెట్టారు. ఇది ఆమె వేసిన రెండవ తప్పటడుగు. కేసీఆర్, కాంగ్రెస్, బీజేపీలపై ధ్వజమెత్తారు. అధికారపార్టీపై తిరుగుబాటు చేశారు. పోలీసు కేసులను ఎదుర్కొన్నారు, వారిచే అవమానింపబడ్డారు. ఒకటికి రెండుసార్లు అరెస్టు అయ్యారు. కోర్టు కేసులను ఎదుర్కొంటున్నారు. ఇంతా చేసి చివరికి తన అన్నను జైలుపాలు చేసిన కాంగ్రెస్‌పార్టీలో తన పార్టీని విలీనం చేయడానికి ప్రయత్నం చేశారు. ఇది ఆమె వేసిన మూడవ తప్పటడుగు. కాంగ్రెస్ పార్టీతో సయోధ్య కుదరకపోవడంతో, తమ పార్టీ తెలంగాణలోని మొత్తం 118 నియోజకవర్గాల నుండి అభ్యర్థులని పోటీలో దింపుతామని షర్మిల ప్రకటించారు. అవసరమైతే తనతో పాటు తన తల్లి, భర్త కూడా బరిలో దిగుతారని ఆమె చెప్పారు. కానీ, చివరికి ఎన్నికలవేళ తాము పోటీ చేయకపోగా కాంగ్రెస్‌పార్టీకి మద్దతు తెలుపుతున్నామని ప్రకటించి ఆమె అభిమానులను, పార్టీ శ్రేణులను నిరుత్సాహపరిచేశారు. ఇది ఆమె వేసిన నాలుగవ తప్పటడుగు. ఇలా ప్రతి నిర్ణయంలోనూ తొందరపాటుతో తప్పటడుగులు వేస్తూనే వచ్చారు షర్మిల.

### షర్మిలకి అండగా విజయమ్మ!

తన అన్నపై షర్మిల వ్యతిరేక గళం విప్పినప్పటినుండీ అమ్మ విజయమ్మ ఆమెకే అండగా ఉన్నారు. కూతురుకి మద్దతుగా తెలంగాణలో తిరుగుతూ ఆంధ్రాలో మరో పార్టీకి గౌరవ అధ్యక్షురాలిగా ఉండడం సబబు కాదనుకున్నారు విజయమ్మ. అందుకోసం ఆమె వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ గౌరవాధ్యక్షురాలి పదవికి రాజీనామా చేశారు. ఆడబిడ్డకు అండగా నిలిచారు. రాజశేఖరరెడ్డి ఆప్తులని, కుటుంబ శ్రేయోభిలాషులని తానే స్వయంగా కలిసి తన కూతురుకి సహకరించమని అభ్యర్థించారు.

### అసలు తప్పెక్కడ జరిగింది?

షర్మిల, విజయమ్మ ఇద్దరూ జగన్‌తో విబేధించడానికి కారణం ఏమిటి? తన నాన్న, అన్నలలా తాను కూడా రాజకీయాలలో కీలకపాత్ర పోషించాలని షర్మిల అనుకోవడమా? తనకు రాజ్యసభ సభ్యత్వం ఇస్తే రాజశేఖరరెడ్డి లెగసీని దేశ రాజధానిలో కొనసాగించాలని షర్మిల ఆశించడమా..?? వై.ఎస్. బిడ్డగా తనకి కూడా రాజకీయ వారసత్వం కావాలని షర్మిల కోరుకోవడమా..??? అలా అయితే తప్పేలేదు. అన్న కోసం అన్ని వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసిన షర్మిలకి ఆ హక్కు కూడా ఉంది. ఇక్కడ విజయమ్మ నిర్ణయంలో కూడా తప్పు పట్టడానికి వీలు లేదు. తన భర్తలాగే తన బిడ్డలిద్దరూ ప్రజాక్షేత్రంలో ఉండాలి అని ఆమె కోరుకోవడంలో ఎలాంటి స్వార్థం లేదు. మరి జగన్, చెల్లెమ్మకి ఒక్క రాజ్యసభ సీటు ఎందుకు ఇవ్వలేకపోయాడు...? అన్న ప్రశ్న వై.ఎస్. కుటుంబ సన్నిహితుల నుండి వస్తోంది. అయితే, చెల్లెమ్మకి పదవి వస్తే కుటుంబ పాలన, బంధుప్రీతి, ఒకే కుటుంబం నుండి ఇద్దరు అన్న.. అపవాదు తమ నాయకుడికి వస్తుంది కాబట్టి ఇవ్వలేక పోయారంటూ జగన్ చుట్టూ చేరిన ఆ నలుగురూ తమ నాయకుడిని సమర్థిస్తూ వివరణ ఇస్తున్నారు. బంధు ప్రీతి అన్న నిబంధన ఉంటే, ప్రభుత్వం ఏర్పడ్డప్పటి నుండీ సలహాదారుగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి, నాలుగేళ్లు టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న వై.వీ.సుబ్బారెడ్డి, కడప ఎం.పిగా ఉన్న అవినాష్‌రెడ్డిలకి కూడా ఈ నిబంధన వర్తించదా...? ఒకవేళ ఒకే కుటుంబానికి చెందిన వారికి రెండు పదవులు ఉండకూడదు అన్న షరతు పెట్టుకుని ఉంటే, ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పార్లమెంటు సభ్యుడిగా ఉన్న ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి, తిరుపతిలో శాసనసభ్యుడిగా, టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న కరుణాకరరెడ్డితో పాటు రాబోవు ఎన్నికలలో ఎం.ఎల్.ఏగా పోటీ చేయనున్న ఆయన కుమారుడు భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి శాసనసభ్యుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డితో పాటు తుడా ఛైర్మెన్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి, ఇప్పుడు సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా ఉన్న సజ్జల కుమారుడు భార్గవ్ రెడ్డి, నెల్లూరుజిల్లాలో మేకపాటి కుటుంబం, ఇలా ఉదాహరణలు చెప్పుకుంటూ వెళ్తే చాలాచోట్ల ఒకే కుటుంబం నుండి బరిలో ఉన్న అనేకమందికి ఈ షరతు వర్తించదా..? అన్న విమర్శ వై.ఎస్. కుటుంబ సన్నిహితుల నుండి వినిపిస్తోంది.

షర్మిలకు ఒక్క రాజకీయ పదవి ఇచ్చి ఉంటే, జగన్ అమ్మ, చెల్లెమ్మా ఇలా వీధులలోకి వచ్చి ఉండేవారే కాదన్నది, కాదనలేని నిజమన్నది సర్వత్రా వ్యక్తమవుతున్న అభిప్రాయం...!

- రాజశ్రీ

లాయర్
నవంబర్ 10, 2023

# రోత రాజకీయాలతో ప్రజాస్వామ్యం అపహాస్యం

ప్రపంచంలోనే అతిపెద్దదైన ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే మనదేశంలో.. రానురాను రాజకీయాలు రోత పుట్టిస్తున్నాయి. అందులోనూ ఎన్నికలప్పుడు జరిగే రాజకీయాలు మరింత దిగజారిపోతూ ప్రజాస్వామ్యాన్ని సైతం అపహాస్యం చేస్తున్నాయి. ఓట్ల కోసం కోట్లరూపాయలు ఖర్చుపెట్టైనా సరే, ఎన్నికల్లో గెలవాలనే ఏకైక ధ్యేయంతో ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఓటర్లను ఆకర్షించడానికి కొత్తకొత్త పథకాలను ముందుకు తీసుకొస్తున్నాయి. రకరకాల హామీలను గుప్పిస్తున్నాయి. ఉచితాలను ఒక ప్రవాహంగా తెస్తున్నాయి. ఆచరణకు రాని వాగ్దానాలెన్నో చేస్తున్నాయి. అధికారంలోకి వస్తే అంతకంత సంపాదించుకోవచ్చనేదే లక్ష్యం తప్ప, ప్రజల బాధల గురించి కానీ, వారి బాగుగురించి కానీ చిత్తశుద్ధితో పట్టించుకునే నాయకనాథులు అరుదైపోతున్నారు.

మరికొద్ది నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, దేశంలో ఇప్పటినుంచే రాజకీయాలు జోరందుకుంటున్నాయి. సెమీఫైనల్స్ అన్నట్లుగా పలు రాష్ట్రాల్లో ఇప్పుడిప్పుడే ఎన్నికల వేడి రగులుకుంటోంది. మిజోరం ఎన్నికలు ఈనెల 7న పూర్తయ్యాయి. ఛత్తీస్‌గఢ్ తొలివిడత ఎన్నికలు కూడా అదేరోజున జరిగాయి. ఇక, మధ్యప్రదేశ్‌లో ఈనెల 17న, రాజస్థాన్‌లో 23న, తెలంగాణలో 30న ఎన్నికలు జరుగనున్నాయి. ఇవన్నీకూడా కీలకమైన ఎన్నికలే. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో రాజకీయ ప్రచారాలు హోరెత్తిపోతున్నాయి. కులమతాల పేరుతో, ప్రాంతాలు..తెగలు-జాతుల పేరుతో విభజించి పాలించు అనే రీతిలో రాజకీయాలు నానాటికీ రొచ్చుగుంటగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా స్వార్థరాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. ఎన్నికలంటేనే డబ్బు, మద్యం వీరంగం చేస్తాయన్నది అందరికీ తెలిసిందే. నోట్లు ఎరచూపి ఓట్లు వేయించుకునేందుకు లోపాయికారీ వ్యవహారాలన్నీ చేయడం మామూలే. గతంలోవలె నైతికప్రమాణాలకు, నీతివంతమైన రాజకీయాలకు తావుండడం లేదు. ఏదో విధంగా గెలిస్తే చాలు..ఎవరెటుపోతే మాకేం అన్నట్లుగా పార్టీల నాయకులు ఓట్ల కోసం ఎంతకైనా బరితెగిస్తుంటారు. ఎన్నికలప్పుడు లేనిపోని వాగ్దానాలు చేయడం, రకరకాల తాయిలాలతో ప్రలోభపెడుతూ అరచేతిలో స్వర్గం చూపించడం నాయకులకు అలవాటైపోయింది. చెప్పే మాటలకు, తీరా గెలిచాక చేసే చేతలకు అసలు పొంతన ఉండదు. ఎన్నికల మేనిఫెస్టోలంటారే కానీ, వాటిని ఏమేరకు ఆచరణలోకి తెస్తారో కూడా చెప్పలేం. ఇవన్నీ ఎంతోకాలంగా ఉన్నవే.. ప్రజలంతా గమనిస్తున్నవే. అయితే, గతంలో కన్నా ఇప్పుడు రాజకీయ వ్యవస్థ మరింత అధ్వాన్నంగా తయారవుతోంది. ఇప్పుడు ఎన్నికల్లో పోటీచేయాలంటే సామాన్యమైన విషయం కాదు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టగలిగే శక్తితో పాటు, తిమ్మిని బమ్మిని చేయగల సామర్థ్యం ఉండాలి. ఓటర్లను బుట్టలో వేసుకునే మాయోపాయాలన్నీ తెలిసుండాలి. అవినీతి, అక్రమాలు చేసేవాళ్ళు, నేరస్తులుగా ఉన్నవాళ్ళు కూడా వారివారి శక్తిసామర్థ్యాలను బట్టి ఎన్నికల బరిలోకి వచ్చేస్తారు. అభ్యర్థిత్వాలు రానివాళ్లు గోడదూకేసి నిస్సిగ్గుగా ఇతర పార్టీల్లో చేరిపోతుంటారు. నైతిక విలువలు, విశ్వసనీయత అనేవి నేటి రాజకీయాల్లో కలికానికి కూడా కనిపించడం లేదు. నిన్న మొన్నటిదాకా ఒక పార్టీలోనే ఉన్నవారు, తీరా ఎన్నికల సమయం దగ్గరపడ్డాక మరోపార్టీ గెలిచే అవకాశం ఉందనుకుంటే, ఆ పార్టీలోకి దూకేస్తుంటారు. నిన్నటిదాకా ఒక పార్టీని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన ఆ నోటితోనే, మరుసటి రోజునుంచి తెగపొగిడేస్తుంటారు. వాటినే అవకాశవాద రాజకీయాలంటారు. నేటి కాలంలో ఉన్నతమైన విలువలతో కూడిన రాజకీయాలను ఆశించడం కూడా అత్యాశే అవుతోందనిపిస్తోంది. అందుకే ఎన్నికల వేళ.. ఓటర్లు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఓటుతోనే భవిత అని గుర్తుంచుకోవాలి. ఇదే అదును.. ఓటుకు పెట్టండి పదును. ఎన్నికలెప్పుడొచ్చినా సరే, లేనిపోని హామీలకు, ఉచితాలకు, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా విజ్ఞతతో వ్యవహరించాలి. అవినీతి, అక్రమాలపై.. అన్యాయాలపై వేటువేయాలి. దేశసౌభాగ్యానికి, ప్రజల సంక్షేమానికి పాటుపడే నాయకులనే ఎన్నుకోవాలి. ప్రజలే జెండాగా.. ప్రజాశ్రేయస్సే అజెండాగా ఉండే నేతలనే గెలిపించుకోవాలి. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అని మనం గొప్పలు చెప్పుకోవడం కాదు, నైతికవిలువలతో రాణించే గొప్ప ప్రజాస్వామిక దేశంగా కూడా ప్రపంచమంతా గొప్పగా చెప్పుకోవాలి. అందుకు ఓటున్న వారంతా తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. దేశ శ్రేయస్సు కోసం ఆ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## వానలతో పాటు.. విషజ్వరాలు

జిల్లాలో ఇటీవల చెదురుమదురుగా వానలు కురుస్తున్నాయి. దీంతో విషజ్వరాలు కూడా ఊపందుకుంటున్నాయి. దగ్గు, జలుబు, జ్వరాలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఆసుపత్రుల్లో అంతా ఈ విషజ్వరాల బాధితులే ఎక్కువగా ఉంటున్నారు. ఒకవైపు పారిశుద్ధ్యం బాగా లేకపోవడం, మరోవైపు వాతావరణ మార్పులు కలిసివెరసి ఈ బాధలు పెరుగుతున్నాయి. ఎక్కడ చూసినా చెత్త పేరుకు పోతుండడంతో దోమలు, ఈగలు పెరిగి అనారోగ్యాలు వ్యాపిస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు ఈ రకం జ్వరాలతో పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. వాతావరణంలో తేమశాతం పెరిగినప్పుడు సహజంగానే ఇలాంటి అనారోగ్యాలు దాపురిస్తుంటుంటాయి. అయితే, వానలొచ్చినప్పుడల్లా ఇదంతా మామూలే కదా అని అనుకోకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తతో ఉండి, తగు జాగ్రత్తలు చేపట్టాలి.

– పీవీఎస్ పద్మనాభరావు, నెల్లూరు.

## మధ్యాహ్నభోజనం నాణ్యతగా ఉండడం లేదు

పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం నాణ్యతగా ఉండాలని, రుచిగా–శుచిగా ఉండాలని అధికారులు ఎంతగా మొత్తుకుంటున్నా ఆచరణలో ఆ భోజనం ఏమంత బాగుండడం లేదు. ఇటీవల సంబంధిత అధికారులు పలు పాఠశాలల్లో పరిశీలనలు చేసినప్పుడు కూడా ఈ విషయం తేటతెల్లమవుతోంది. అంగన్‌వాడీల్లోనూ చాలాచోట్ల ఇదే దుస్థితి. ఎవరెన్ని తనిఖీలు చేసినా పరిస్థితుల్లో మార్పుండడం లేదు. వారికిచ్చే వేతనాలు, తెచ్చే సరుకులు బాగుంటే భోజనం కూడా బాగుంటుంది. ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకుని, సమస్యలు ఎక్కడున్నాయో పరిశీలించి, అన్నిచోట్లా ఈ పథకం సక్రమంగా అమలుజరిగేలా చూస్తే బాగుంటుందని మనవి.

– హెచ్.నరసింహ, కోవూరు.

# రాయసం సేవలు మార్గదర్శకం

## • వీపీఆర్ చేతులమీదుగా గంగపట్నంలో విగ్రహావిష్కరణ



గంగపట్నం మాజీ సర్పంచ్, ప్రజా నాయకుడు రాయసం వెంకటేశ్వరరావు గ్రామానికి చేసిన సేవలు అమోఘమని, ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇందుకూరుపేట మండలం గంగపట్నం మాజీ సర్పంచ్ స్వర్గీయ రాయసం వెంకటేశ్వరరావు విగ్రహావిష్కరణ ఈనెల 7న ఎంతో వైభవంగా జరిగింది. గంగపట్నంలో ఏర్పాటు చేసిన ఆ కాంస్య విగ్రహాన్ని రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ. అజాతశత్రువు, ప్రజానాయకుడు రాయసం వెంకటేశ్వరరావు విగ్రహావిష్కరణలో పాల్గొనడం, చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామానికి సేవ చేసే అవకాశం చాలా తక్కువమందికే దక్కుతుందని, ఒకవేళ అవకాశం వచ్చినా సరైన మార్గంలో ఉపయోగించే వారు అరుదన్నారు. రాయసం వెంకటేశ్వర రావు ప్రజాసేవలో తరించిన అరుదైన వ్యక్తి అని, ఆయన సేవలు మార్గదర్శకమని కొనియాడారు. గంగపట్నానికి 2సార్లు సర్పంచ్‌గా, 3సార్లు వైస్ సర్పంచ్‌గా, వార్డు మెంబర్‌గా కూడా ఆయన పనిచేశారని, గ్రామానికి ఎంతో అభివృద్ధిని తెచ్చిపెట్టారని విపిఆర్ గుర్తుచేశారు. గంగపట్నంలో వెంకటేశ్వర్‌రావు చేసిన అభివృద్ధి ఇప్పటికీ మనకు కనిపిస్తుందని, పల్లిపాలెం తీరప్రాంతంలో 2004 తుఫాను సమయంలో ఆయన సేవలు ఎప్పటికీ మర్చిపోలేమని, గ్రామస్తులను ఆయన కంటికి రెప్పలా కాపాడుకున్నారని వివరించారు. తండ్రి బాటలోనే ఆయన కుమారులు వాసు దేవరావు, దామోదరరావు, హృషీకేశవ రావు ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారని, భవిష్యత్తులోనూ ఆ సేవలను కొనసాగించాలని అన్నారు. రాయసం వారు మన సున్న మంచినేత అని, ఆయనసేవలు చిరస్థాయిగా నిలిచే వుంటాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, విజయా డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, దువ్వూరు రాధాకృష్ణా రెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్, మావులూరు శ్రీనివాసులురెడ్డి, వైసీపీ జిల్లా కోశాధికారి కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కేతంరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, ఇతర ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జగనన్నకు అండగా ఉంటామంటున్న ప్రజలు

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాను ఏ ఇంటికి వెళ్ళినా అక్కడి ప్రజలు జగనన్నకు అండగా ఉంటామని, ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు తామందరికీ అందుతున్నాయంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వైకాపా వెంకటగిరి నియోజకవర్గ సమన్వకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 7న ఆయన సైదాపురం మండలంలోని తుమ్మలతలుపూరు గ్రామంలోని సచివాలయ పరిధిలో గడపగడపకు తిరిగారు. రాష్ట్రంలో పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఆయన ప్రజలకు వివరించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడం, ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా రానున్న ఎన్నికల్లో వైకాపా విజయం సాధిస్తుందని, మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమాగా చెప్పారు.

## జిల్లాలో 2.19 లక్షల మందికి...

# రూ. 90.55 కోట్ల 'రైతు భరోసా'



జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల మంది రైతులకు రెండోవిడత రైతు భరోసా–పీఎం కిసాన్ నగదు సుమారు 90.55 కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి నుంచి ఈనెల 7న నేరుగా రైతుల ఖాతాలకు జమచేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్ నుంచి జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అతి కీలకమైన పథకం రైతు భరోసా అని, వ్యవసాయ ఖర్చులకు పెట్టుబడి సాయంగా రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం రైతు భరోసా– పిఎం కిసాన్ నగదు అందజేస్తోందని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 1474కోట్ల రూపాయలను రైతు భరోసా కింద అందజేసినట్లు చెప్పారు. విత్తనం నాటడం నుంచి ధాన్యం అమ్ముకునే వరకు ప్రతి అడుగులోనూ అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగ అని చెబితే, ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పండగలా వ్యవసాయాన్ని మార్చేశారని అన్నారు. రైతులకు గ్రామస్థాయిలోనే అన్ని సేవలు అందిస్తూ, సాంకేతికంగా వారికి తోడ్పాటునందించేలా రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. వైయస్సార్ జలకళ పథకం ద్వారా రైతన్నలకు ఉచితంగా బోర్లు, మోటారు కనెక్షన్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఉచిత పంటల బీమా ద్వారా రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించి రైతుకు అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. పగటిపూట 9 గంటల వరకు విద్యుత్‌ను అందిస్తున్నారని, అలాగే ఏ సీజన్లో జరిగిన నష్టాన్ని ఆ సీజన్ ముగిసేలోగా రైతుల ఖాతాలకు జమ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు.

## అబ్దుల్ అజీజ్‌పై..

# అట్రాసిటీ కేసు

విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారిపై దౌర్జన్యం చేశారంటూ తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు, జిల్లా టీడీపీ నేత అబ్దుల్ అజీజ్‌కు నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు ఈనెల 7న నోటీసులు ఇచ్చారు. గత మార్చి 1న జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కర్నాలమిట్ట పోలింగ్ కేంద్రం వద్ద అబ్దుల్ అజీజ్ విధులు నిర్వహిస్తున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములు నాయక్‌పై దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ పోలీసులు ఆయనపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## వ్యవసాయ శాస్త్రవేత్తలు..

# రైతులకు అండగా ఉండాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలవాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ అన్నెం సుబ్బరామిరెడ్డి చెప్పారు. నెల్లూరు బీవీ నగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన ఇటీవల అసిస్టెంట్ ప్రొఫెసర్ గురవారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు నిమ్మమొక్కలు, టార్పాలిన్ పట్టలు, జీవన ఎరువులను ఉచితంగా అందజేశారు. ఈ కేంద్రంలో రైతులకు వ్యవసాయ విషయాలపై అవగాహన కలిగిస్తూ వివిధ శిక్షణ తరగతులను నిర్వహించడం అభినందనీయమన్నారు. కృషి విజ్ఞానకేంద్రం విస్తరణ శాస్త్రవేత్త లోకేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తసత్రం విద్యార్థినులకు బంగారు పతకాలు



కావలి రూరల్ మండలం కొత్తసత్రం హైస్కూలు విద్యార్థినులు జంప్‌రోప్‌లో తమ సత్తా చాటుకుంటూ బంగారు పతకాలు సాధించారు. ఇటీవల తెనాలిలో జరిగిన 19వ జాతీయస్థాయి జంప్‌రోప్–అండర్ 12 క్రీడా విభాగంలో వై.జ్యోతి, పి.సరిత స్వర్ణపతకాలు సాధించడంతో ఆ పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాసరావు, పీడీ మురళి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




# నెల్లూరు కబుర్లు

## 11న శాంతి ర్యాలీ



పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు ఆపాలని, యుద్ధం ఆగాలని కోరుతూ ఈ నెల 11న వామపక్షాల ఆధ్వర్యంలో నెల్లూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. ఈనెల 7న ఆయన నగరంలోని సిపిఐ (భారత కమ్యూనిస్టు పార్టీ), వామపక్షాల నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. యుద్ధం వద్దని, శాంతి స్థాపన జరగాలని వారు ఆకాంక్షించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

## వైద్యారోగ్య శాఖలో అక్రమాలపై.. ఆర్డీ విచారణ

జిల్లా వైద్యారోగ్యశాఖలో అవినీతి, అక్రమాలు, ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ వైద్యారోగ్యశాఖ అధికారి (డిఎం అండ్‌హెచ్ఓ)పై ఇటీవల వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి ఈనెల 7న నెల్లూరుకు వచ్చి విచారణ చేపట్టారు. డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలోని అధికారులను, సిబ్బందిని విచారించారు. త్వరలోనే నివేదికన ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

## 14న ఐఏబీ సమావేశం

నెల్లూరు జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఈనెల 14వ తేదీన జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. డెల్టాకు సాగునీరు విడుదలకు తగ్గ నిర్ణయాలు తీసుకునేందుకు సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించాలని రైతులు కలెక్టర్‌కు ఇటీవల వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఈ నెల 13 వతేదీన సాగునీటి సలహా మండలి సమావేశం జరుగుతుందని రైతులకు తెలియచేశారు. అయితే ప్రభుత్వం దీపావళి సందర్భంగా 13వ తేదీ సెలవుదినంగా ప్రకటించడంతో 14వ తేదీన ఈ సమావేశం నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు.



## కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం

### - పార్టీశ్రేణులకు డీసీసీ నేత చేవూరు పిలుపు -

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరు ఇందిరాభవన్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని పటిష్టవంతం చేసేందుకు పట్టుదలగా కృషి చేసి నెల్లూరు జిల్లా ప్రప్రథమ స్థానంలో నిలిచినందుకు సంతోషంగాఉందని ఆయనన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తన సత్తాచాటాలన్నారు. పార్టీ కోసం భాధ్యతాయుతంగా పనిచేసే ప్రతి ఒక్కరిని పార్టీ అధిష్టానం గుర్తించి సరైన గౌరవాన్నిస్తుందని చెప్పారు. పీసీసీ ఉపాధ్యక్షులు సీవీ శేషారెడ్డి, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి లేళ్ళపల్లి సురేష్‌బాబు, డీసీసీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు షేక్ ఫయాజ్, చింతల వెంకట్రావు, దుద్దుకూరు రమేష్‌నాయుడు, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా అనిల్‌కుమార్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు రాజా, మహిళా అధ్యక్షురాలు అన్నం లత రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు షేక్ అల్లావుద్దీన్, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నాగిరెడ్డి, రాజేష్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కో-కన్వీనర్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## డా.సీవీ రామన్ జయంతి



వైజ్ఞానిక రంగంలో నోబెల్ బహుమతి అందుకున్న తొలి భారతీయ భౌతిక శాస్త్రవేత్త, భారత రత్న డాక్టర్ సి.వి. రామన్ జయంతిని పురస్కరించుకొని నెల్లూరు బీవీనగర్‌లో ఉన్న జి.వి.ఆర్.ఆర్. జూనియర్ కళాశాలలో ఇటీవల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆ మహనీయుని సేవలు గుర్తుచేసుకుని నివాళులర్పించారు. విశ్రాంత భౌతిక శాస్త్ర అధ్యాపకులు సోమశేఖరం సౌజన్యంతో ప్రతిఏటా ఈ కళాశాలలో పబ్లిక్ పరీక్షలలో భౌతికశాస్త్రంలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు దేవకి, జగదీష్, గణేష్ ఒక్కొక్కరికి 2వేల రూపాయలు చొప్పున నగదు బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, గణితశాస్త్ర ఉపన్యాసకులు జాకీర్, పీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కరువు మండలాలను ప్రకటించాలి

### - జేసీకి మిడతల వినతి




ప్రస్తుతం చెదురు మదురుగా కురుస్తున్న వర్షాల వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదని, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు ఇటీవల వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో వర్షాభావం మూలంగా ఉపాధి కొరకు వలస పోతున్న రైతుకూలీలను పరిగణనలోనికి తీసుకొని కరువు మండలాలు ప్రకటించాలన్నారు. సోమశిల జలాశయం, కండలేరు జలాశయాల్లో పంటలకు తగ్గ నీటి నిల్వలు లేవని, జిల్లాలో ఇప్పటికే 12 మండలాలలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. పంట కాలువల్లో నీటిపారుదులకు అడ్డంకిగా ఉన్న గుర్రపు డెక్క తొలగించాలని ఆయన సూచించారు.

## వృద్ధులను ఆదరించాలి



వృద్ధులను ఆదరించాలని, వారి క్షేమాన్ని పట్టించుకుని సమస్యలు లేకుండా చూడాలని ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి అనుమల జయప్రకాష్ చెప్పారు. ఈనెల 7న ఆయన వృద్ధుల సంక్షేమంపై సీపీ, పీహెచ్‌సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని వేదాయపాలెం వద్దనున్న చైతన్యపురిలోని సుస్మిత నర్సింగ్ స్కూల్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను పెంచి, పెద్దచేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిరాదరించడం మంచిదికాదని, వారి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. వారి ఆరోగ్య సమస్యలను పర్యవేక్షిస్తుండాలని, అవసరమైన చికిత్సలు చేయిస్తుండాలని సూచించారు. అనంతరం వృద్ధుల హక్కులు, బాధ్యతలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ శాఖవరపు వేణుగోపాల్, హెల్ప్ ఏజ్ ఇండియా సీనియర్ మేనేజర్ మరీనాల్ లంకపల్లి, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్‌బాషా, గోరంట్ల శేషయ్య, జాన్‌బాబు, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 80వ భాగం




భీమసేనుని భీషణ శపథం విని, విదురుడు, కౌరవ వంశంలో మహా ప్రళయం సంభవించబోతున్నదని హెచ్చరిస్తాడు. దుర్యోధనుడు, మిగతా పాండవులు తమకు ధర్మరాజు ఆధీశ్వరుడు కాదని చెప్తే ద్రౌపదికి దాస్యవిముక్తి కలగచేస్తానని చెప్తాడు. అర్జునుడు మాకు ధర్మరాజే ఆధీశ్వరుడని చెప్తాడు. ఇంతలో కౌరవ అంతఃపురాలలో నక్కలు అరుపులు, గుడ్లగూబల కూతలు, గాడిదల ఓండ్రలు వినపడతాయి. గాంధారీదేవి భయపడి ధృతరాష్ట్రునికి చెప్పినప్పుడు ధృతరాష్ట్రుడు, తన కుమారులకు కీడు సంభవిస్తుందని, ద్రౌపదిని పిలిచి ధర్మరాజుకి, పాండవులకు దాస్యవిముక్తి కలిగేటట్లు రెండు వరాలిస్తాడు. ద్రౌపది వలన, పాండవులకు దాస్య విముక్తి కలిగిందని, కర్ణుడు హేళనగా మాట్లాడితే, భీముడికి కోపం వచ్చి శత్రువులను సంహరిస్తానని గర్జించినప్పుడు అర్జునుడు, ధర్మరాజు శాంతింపచేస్తారు. పాండవులు కౌరవ కుమారుల మీద పగపెంచుకోకుండా, ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు జరిగిందంతా మర్చిపొమ్మని, పాండవుల సామ్రాజ్యాన్ని తిరిగి ఇచ్చేసి, ఇంద్రప్రస్థ నగరం వెళ్లి పరిపాలన కొనసాగించుకొమ్మని కోరతాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## రెడ్‌క్రాస్‌లో 15 నుంచి.. శిక్షణా తరగతులు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ- నెల్లూరు జిల్లా శాఖ, సెయింట్ జాన్స్ అంబులెన్స్ న్యూ ఢిల్లీ వారి సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణా తరగతులు ఈనెల 15వ తేదీనుంచి ప్రారంభించనున్నారు. ఈ శిక్షణలో పాల్గొనదలచిన వారు ఈనెల 13వ తేదీలోగా నెల్లూరులోని రెడ్ క్రాస్ కార్యాలయంలో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆసక్తి కలిగినవారు వివరాలకు డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ సెల్ ఫోన్ 9100078571 నంబరును సంప్రదించాలని సూచించారు.

## 'కవితా కుసుమాలు' ఆవిష్కరణ



నెల్లూరుకు చెందిన కవయిత్రి సోడే గీతాంజలి రచించిన 'కవితా కుసుమాలు' కవితాసంపుటి ఆవిష్కరణ ఈనెల 5న ప్రముఖ నవలా రచయిత్రి డా.పెళ్ళకూరు జయప్రద చేతులమీదుగా జరిగింది. నెల్లూరు టౌన్‌హాల్ రీడింగ్ రూంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నెరసం అధ్యక్షులు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వ్యవహరించారు. నారాయణ దంతవైద్యులు డా.నటరాజ కన్నన్, సర్వేపల్లి రామ్మూర్తి అతిథులుగా పాల్గొనగా, డా.గంగిశెట్టి శివకుమార్ పుస్తక సమీక్ష చేశారు. కవితాసంకలనంలోని విశేషాలను సోదాహరణంగా వివరించారు నెరసం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ సారధ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత, యుద్ధం-శాంతి అన్న అంశం మీద కవి సమ్మేళనం జరిగింది. దాదాపు 20మంది కవులు ప్రపంచశాంతిని కోరుతూ తమ కవితలను పఠించారు. ముఖ్య అతిథి డా.చీమకుర్తి వేంకటేశ్వరరావు పాల్గొని, భారతంలోని పద్యం ద్వారా శాంతి ప్రాముఖ్యతను వివరించారు.



# శ్రీవారి సేవలో.. వెంకయ్య కుటుంబం

## -- స్వాగతించిన టీటీడీ బోర్డు ఛైర్మెన్ కరుణాకర్‌రెడ్డి తదితరులు --

భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ఈనెల 4వ తేదీ, శనివారం రోజున తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆరోజు ఉదయం తన కుటుంబసభ్యులతో కలసి ఆయన తిరుమలేశుని ఆలయం వద్దకు రాగానే, టీటీడీ అధికారులు వారిని సాదరంగా స్వాగతించారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి మొక్కి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి మూలమూర్తిని దర్శనం చేసుకున్న తర్వాత, రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెంకయ్యానాయుడిని స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు. టీటీడీ కార్యనిర్వహణాధికారి ఏ.వి ధర్మారెడ్డి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఆలయం వెలుపలకు వచ్చాక, దేశ ప్రజలంతా సుఖసంతోషలతో ఉండాలని, తెలుగువారు దేశాభివృద్ధి పథంలో పయనించాలని శ్రీవారిని ప్రార్థించానని వెంకయ్యానాయుడు చెప్పారు. తొలుత, తిరుమలలోని అతిథిగృహం వద్ద టీటీడీ ఛైర్మెన్ కరుణాకర్‌రెడ్డి వెంకయ్య నాయుడును గౌరవపూర్వకంగా కలసి ఆహ్వానించారు. మహా ప్రస్థానం, కన్యాశుల్కం, సత్యశోధన పుస్తకాలను బహుకరించి దుశ్శాలువతో సత్కరించారు.

### సాధారణ భక్తునిగా...

శ్రీవారిని దర్శించుకున్న తర్వాత, ఆలయం వెలుపల ఉన్న శ్రీ వెంగమాంబ అన్నదాన సత్రంలో వెంకయ్య సాధారణ భక్తునిగా, భక్తుల మధ్య ఆయన కుటుంబసభ్యులతో కలసి కూర్చుని, అన్న ప్రసాదాన్ని స్వీకరించడం భక్తులందరికీ సంతోషం కలిగించింది. ఆయన భక్తిని, నిరాడంబరత్వాన్ని అందరూ కొనియాడారు. నిత్యం రుచిగా, శుచిగా వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాదాన్ని అందిస్తున్నారంటూ టీటీడీ నిర్వాహకులకు, సిబ్బందికి వెంకయ్యానాయుడు ఈ సందర్భంగా తన అభినందనలు తెలియజేశారు.





# టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రమాణస్వీకారం



తిరుమల తిరుపతి దేవస్థానాల ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలిగా రెండవసారి రాజ్యసభ సభ్యులు, నెల్లూరుజిల్లా వైకాపా అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవాపరాయణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపీఆర్) సతీమణి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 6న ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని టీటీడీ ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఆలయ ఈవో ధర్మారెడ్డి సమక్షంలో మండలి సభ్యులతో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పదవికి రెండోసారి ప్రశాంతిరెడ్డి నియమితురాలు కావడం విశేషం. టీటీడీ ఉత్తర భారతదేశ దేవాలయాల అభివృద్ధికి కృషిచేస్తుండడం, ఆధ్యాత్మికతను పెంపొందించేలా అనేక కార్యక్రమాలు చేపట్టడంలో ముఖ్యపాత్ర పోషిస్తుండడం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవాదులు, పలువురు ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు.

# త్యాగరాజ స్మరణోత్సవాలకు.. భిక్షాటన ప్రారంభం



నెల్లూరులో ఎంతో సుప్రసిద్ధమైన భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజస్వామి 59వ స్మరణోత్సవాలు వచ్చే ఏడాది మార్చి 30వ తేది నుంచి ఏప్రిల్ 5వ తేదివరకు నెల్లూరు టౌన్‌హాల్‌లో వైభవంగా జరుగనున్నాయి. ఈనెల 4న భిక్షాటన ప్రారంభమైంది. తొలుత, కమిటీ ప్రధాన కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు చేసిన అనంతరం త్యాగరాజస్వామి కీర్తనలను ఆలపిస్తూ నగర వీధుల్లో భిక్షాటన ప్రారంభించారు. భిక్షాటనలో నాగదేవిప్రసాద్‌తో పాటు స్వామివారి భక్తులు డి.రామ చంద్రమూర్తి, ఏ.రామప్రసాద్, అన్నవరం సత్యనారాయణ, ఎస్.హనుమంతరావు, జి. రామచంద్రయ్య, ఎస్.నాగలక్ష్మి, ఎం.లక్ష్మీకామాక్షి, కె.అరుణ, వనజ, కుమార్, ఎస్.మాధవరావు, వి.శివ కుమార్, టి.వెంకటేశ్వర్లు, వంకా ప్రసాద్, కాళహస్తి సుబ్రహ్మణ్యం, దూబగుంట ప్రభాకర్, ఆర్.వి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# 'జనరిక్' ఆధ్వర్యంలో.. ఉచిత వైద్యశిబిరం



నెల్లూరులోని చింతారెడ్డి పాళెం వద్ద నున్న అళహరి నగర్‌లో ఈనెల 5న రెడ్ క్రాస్ జనరిక్ మెడికల్ షాపు ఆధ్వర్యంలో ఈనెల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు నిపుణులైన వైద్యులతో రోగులకు ఆరోగ్యపరీక్షలు చేయించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ సిహెచ్ అజయ్‌బాబు, అడ్వయిజర్ జనార్ధన్ రాజు, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు యు.మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

మా ఉన్నతిని కాంక్షించే మా పెద్దదిక్కు
మాకు స్ఫూర్తిప్రదాత
**కోడూరు రంగారెడ్డి** గారు
(పూడిపర్తి, నెల్లూరుజిల్లా)
తేది. 31.10.2023,
మంగళవారం పరమపదించారు.
వారి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

బత్తల లక్ష్మీధర్‌రెడ్డి, నెల్లూరు
బత్తల హేమంత్‌కుమార్‌రెడ్డి, బెంగళూరు
బత్తల మురళీధర్‌రెడ్డి, హైదరాబాదు

**ఉత్తరక్రియలు:** వారి ఉత్తరక్రియలు తేది. 16.11.2023 గురువారం ఉదయం 11గంటలకు నెల్లూరు లెక్చరర్స్ కాలనీ, మాగుంట లే అవుట్ ఎక్స్‌టెన్షన్‌లోని 'కౌసల్య నిలయం' అపార్ట్‌మెంట్స్ నందు జరుగును. కావున తెలియజేయడమైనది.





# శ్రీసిటీలో సెబ్ సమావేశం



తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఆఫీసర్ (డిఎస్ఈఓ) ఏ.రాజేంద్ర ఆధ్వర్యంలో ఈనెల 6న జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబి-సెబ్) సమీక్షా సమావేశం జరిగింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలను, వాటి వినియోగాన్ని అరికట్టడానికి చేపట్టాల్సిన ప్రణాళికల గురించి ఈ సందర్భంగా రాజేంద్ర వివరించారు. జిల్లావ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన అన్ని మార్గాలను గుర్తించాలని, పోలీసు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎలాంటి చట్టపరమైన శిక్షలకు గురవుతారో గ్రామాలలో, కళాశాలలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నాటుసారా తయారీని పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తరలింపు, విక్రయాలను అరికట్టాలని, అలాంటి విక్రయదారులకు శిక్షల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా పెట్టి పూర్తిగా వాటిని తొలగించాలని చెప్పారు. పాత నేరస్తులపై గట్టి నిఘా పెట్టాలన్నారు. జాతీయ రహదారుల్లో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించడం ద్వారా సూళ్లూరుపేట, ఇతర పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాలు సరఫరాను అదుపుచేయాలని ఆదేశించారు. జిల్లాను గంజాయి రహిత జోన్‌గా మార్చడానికి సెబ్ అధికారులు, స్థానిక పోలీసులు సమిష్టిగా కలిసి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో తిరుపతి అర్బన్, రూరల్, తిరుమల, చంద్రగిరి రూరల్, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం, గూడూరు, వెంకటగిరి, సూళూరుపేట, నాయుడుపేట, వాకాడు ఎస్ఈబి సీఐలు, ఎస్సైలు, జిల్లా టాస్క్ ఫోర్స్, ఇంటెలిజెన్స్ సిబ్బంది పాల్గొన్నారు. సెబ్ సమావేశం శ్రీసిటీలో జరిపినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. అన్నివిధాలా మంచి వాతావరణం కలిగి పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి జిల్లాను మరింత సురక్షితంగా ఆరోగ్యకరంగా ఉంచడంలో ఈ తరహా సమావేశాలు సహాయపడతాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో వున్న శ్రీసిటీని డ్రగ్స్ రహిత, ప్రశాంతమైన నగరంగా తీర్చిదిద్దడానికి సెబ్, స్థానిక పోలీసులకు శ్రీసిటీలోని ఉద్యోగులతో సహా ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## జొన్నవాడ ఆలయానికి.. రూ.45.66 లక్షల రాబడి

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానానికి కేవలం 84 రోజుల్లోనే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 45.66 లక్షల రూపాయల రాబడి వచ్చింది. ఈనెల 7న ఆలయంలో హుండీ లెక్కింపు జరిగింది. నగదుతోపాటు, 10 సింగపూర్ డాలర్లు, 20లండన్ పౌండ్లు, 185 గ్రాముల బంగారు, 388 గ్రాముల వెండి వస్తువులు కూడా ఉన్నాయని ఆలయ వర్గాలు తెలిపాయి.



## కల్యాణ వేంకటేశ్వరునికి.. విపిఆర్ పూజలు

రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ఈనెల 8న బుచ్చిరెడ్డిపాళెంలో కొలువైవున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా తొలుత, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దైవదర్శనం అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో విజయా డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, బుచ్చి నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో ఈనెల 7న జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి రామచంద్రారెడ్డి, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య పద్మనాభం ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిని పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ కాపాడాలని, ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతగా గుర్తించి మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.యం సుందరవల్లి పర్యవేక్షణలో విఎస్‌యులో ఇప్పటికే పచ్చదనం పెరిగిందని వారు కొనియాడారు. ఆచార్య లలిత రాణి, ఆచార్య రంగనాథన్, డీన్ సీడీసీ ఆచార్య, సిహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## బాడ్మింటన్ పోటీలలో గౌస్ జట్టుకు గోల్డ్ మెడల్

గోవాలో నిర్వహించిన 37వ జాతీయ స్థాయి షటిల్ బాడ్మింటన్ క్రీడా పోటీలలో మిక్సెడ్ డబుల్స్ విభాగంలో ఆంధ్ర జట్టు క్రీడాకారులు ఛాంపియన్స్‌గా నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈనెల 18వ తేదీ నుండి 24వ తేదీ వరకూ గోవాలో షటిల్ బాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ఆ పోటీలలో ఆంధ్ర రాష్ట్రం తరఫున మిక్సెడ్ డబుల్స్ విభాగంలో షేక్ గౌస్, పూజా దండు జట్టు ప్రాతినిధ్యం వహించారు. ఫైనల్స్‌లో తెలంగాణ జట్టుపై వరుస రెండు సెట్లలో గెలుపొంది నేషనల్స్ టైటిల్ కైవసం చేసుకున్నారు. ఆంధ్ర షట్లర్లు నేషనల్ ఛాంపియన్స్‌గా నిలవడంతో రాష్ట్రంలో షటిల్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**గూడూరులో సంబరాలు...**

గూడూరు నివాసి షేక్ గౌస్ మిక్సెడ్ డబుల్స్‌లో నేషనల్ ఛాంపియన్‌గా నిలవడంతో ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మూడు నెలల క్రితం గౌస్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్స్ టైటిల్ సిద్ధార్థ్‌తో కలిసి కైవసం చేసుకున్నాడని, విజయాల పరంపర కొనసాగిస్తున్న గౌస్ అంతర్జాతీయ స్థాయిలోనూ చక్కగా రాణించాలని ఆకాంక్షించారు.

## డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో చదరంగం పోటీలు



గూడూరు, డిఆర్‌డబ్ల్యూ మహిళ కళాశాలలోని ఓపెన్ ఆడిటోరియం సమావేశ మందిరంలో ఈ నెల 7న అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, ఐకానిక్ పీస్ జాతీయ స్థాయి అవార్డు గ్రహీత డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న మేధాశక్తిని ప్రదర్శించేందుకు ఈ చదరంగం పోటీలు దోహదపడతాయన్నారు. చిల్డ్రన్స్ డేను పురస్కరించుకుని ఈ చదరంగం పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చెస్ అసోసియేషన్ నిర్వాహకులు నరేంద్రనాథ్ చౌదరి పర్యవేక్షణలో 18 పాఠశాలలకు చెందిన 210 మంది విద్యార్థులు ఈ చదరంగం పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నెహిమియా, గిరిబాబు, మనోజ్‌కుమార్ యోగి, చెస్ ఆర్గనైజర్ రామ్, షేక్ అమ్మదీన్, మురళి, షేక్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## జే.వి.వి 'చెకుముకి సైన్స్ పరీక్షలు'



గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చెకుముకి సైన్స్ పరీక్షల గోడపత్రికలను ఇటీవల జే.వి.వి. ప్రతినిధులు ఆవిష్కరించారు. జే.వి.వి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజల్లో మూఢనమ్మకాలు పోవాలనే ఉద్దేశ్యంతో విద్యార్థి దశనుండే చైతన్యం రావాలని విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు గత 32 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమరావు, రామమోహన్, సాయికిరణ్, గుర్రం విజయబాబు, విష్ణు, కటకం శ్రీను, నక్కా గోపి, పవన్ పాల్గొన్నారు.

## 'ప్రజా రక్షణ భేరి' జయప్రదం చేయండి



కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశం ప్రమాదకర స్థితిలోకి వెళ్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆరోపించారు. గూడూరులో ఈ నెల 5వ తేదీన టవర్‌క్లాక్ సెంటర్ వద్దకు బస్సుయాత్ర చేరుకొంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంపదను కేంద్రం కార్పొరేట్ వర్గాలకు దోచిపెడుతోందన్నారు. ఈ నెల 15న విజయవాడలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వ్యతిరేకిస్తూ తలపెట్టిన ప్రజా రక్షణభేరిని విజయవంతం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



## నిర్దేశిత ప్రదేశాల్లోనే టపాసుల విక్రయం

టపాసుల దుకాణాల ఏర్పాటుపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజలకు అనువైన ప్రదేశంలోనే విక్రయించేలా చూడాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. టపాసుల అమ్మకాలపై వచ్చిన ఫిర్యాదు గురించి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, పురపాలక సంఘం అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. దీపావళి సందర్భంగా అమ్మకాలు, అనుమతులు, పాటించాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి, వివిధ మండలాల తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మరోవైపు డివిజన్‌లోని ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలపై ఆర్డీవో కిరణ్‌కుమార్ సమీక్షించారు.

## ట్రాఫిక్ కానిస్టేబుళ్ళకు రెయిన్‌కోట్స్



గూడూరు, బాలాజీనగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఈ నెల 7న పొణకా మల్లికార్జునరెడ్డి సహకారంతో ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న 15 మంది ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రెయిన్‌కోట్స్‌ను ముఖ్యఅతిథిగా హాజరైన గూడూరు టౌన్ సి.ఐ హజరత్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఏఎస్ఐలు లక్ష్మీపతి, బాబురావు, ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బండి ధనంజయరెడ్డి, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# ఓబీసీ మహిళలకు రిజర్వేషన్‌లు ఇవ్వాలి

చట్టసభల్లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు కేసన శంకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు కోరారు. ఇటీవల నెల్లూరులో వారు విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలప్పుడు మాత్రం ఓబీసీలను ఓటుబ్యాంకుగా రాజకీయపార్టీలు వాడుకుంటున్నాయే తప్ప, ఓబీసీలకు రాజకీయాల్లో తగు ప్రాముఖ్యత ఇవ్వడం లేదని విమర్శించారు. జనాభాలో 52శాతం వరకు ఉన్న ఓబీసీ వర్గాల కులగణన వెంటనే చేపట్టాలన్నారు. ఈ సమావేశం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకపాటి మాల్యాద్రి, ఉపాధ్యక్షుడు షేక్ సలీమ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయమ్మ, ద్వారక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అన్యాయాన్ని ప్రశ్నిస్తే.. అక్రమకేసులా?

## - మాజీమంత్రి నారాయణ



రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని మాజీమంత్రి, టీడీపీ నగర ఇన్‌చార్జి పొంగూరు నారాయణ ఆరోపించారు. ఈనెల 7న ఆయన నెల్లూరు సంతపేటలో జరిగిన 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికీ వెళ్ళి వైకాపా ప్రభుత్వ తీరును వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోకపోవడంతో, రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతోందని విమర్శించారు. రానున్న ఎన్నికల విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ఓటర్ల జాబితాపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాలను పరిశీలించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి విజయం చేకూర్చాలని విజ్ఞప్తిచేశారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనూరాధ, రాజానాయుడు, కువ్వారపు బాలాజీ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

నెల్లూరులోని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో ఇటీవల ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఏసీబీ డీఎస్పీ మోహన్ ఆధ్వర్యంలో అధికారులు రికార్డులు పరిశీలించారు. ఏటా ఫుడ్ కంట్రోలర్ జారీ చేసే లైసెన్స్‌లు, రెన్యువల్స్ వగైరాలకు సంబంధించిన విషయాలను ఆరాతీశారు. ఎన్ని శ్యాంపిళ్లు సేకరించారు, ఎన్నింటిని ప్రయోగశాలలకు పంపి, కల్తీలకు పాల్పడేవారిపై ఎలాంటి చర్యలు చేపట్టారన్న విషయమై పరిశీలనలు చేశారు. ఏసీబీ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాసరావు, విజయకుమార్, కిరణ్, ఆంజనేయరెడ్డి తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

# తెలంగాణ కప్పు ఈసారీ కేసీఆర్ దే!



'తెలంగాణ కప్పు' కోసం ఈ నెలాఖరులో జరగనున్న ఫైనల్స్‌లో మరోసారి కేసీఆర్ టీమే గెలవబోతోంది. కెప్టెన్‌గా కేసీఆర్ చరిత్ర సృష్టించబోతున్నారు. ఆయన స్వయంగా బ్యాట్స్‌మ్యాన్, బౌలర్.. ఆ టీమ్‌కు ఫాస్ట్‌బౌలర్, పేస్‌బౌలర్, స్పిన్‌బౌలర్ కూడా ఆయనే. ఏ పిచ్ మీద ఏ రకమైన బౌలింగ్ చేయాలో ఆయనకు తెలిసినంతగా మరొకరికి తెలియదు. పైపెచ్చు తెలంగాణలోని మొత్తం 119 పిచ్‌లపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. వీటికితోడు అద్భుతమైన ఫీల్డర్. దూసుకువచ్చే ప్రత్యర్థుల షాట్‌లను గాలిలోకి ఎగిరి మరీ ఒంటి చేత్తో క్యాచ్ చేయగలిగిన సామర్థ్యం ఆయన సొంతం.

ఆయనతో పాటు, మరో ఇద్దరు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ ఉన్నారు.

ఒకరు వైస్ కెప్టెన్ కేటీఆర్ కాగా, రెండవ వారు స్టైలిష్ బ్యాట్స్‌మెన్ కమ్ ఆల్ రౌండర్ హరీష్‌రావు. ఈ ఇద్దరూ బ్యాటింగ్‌తో బాటు బౌలింగూ చేస్తారు, ఫీల్డింగూ చేస్తారు.

ఆటకు సంబంధించిన అన్ని శాఖల్లోనూ ఈ ముగ్గురూ... ఎవరికి వారే. ఒకరితో ఒకరిని పోల్చడానికి వీలులేదు. ఎవరి టాలెంట్ వారిదే.

ఫైనల్స్‌కు రావాల్సిన మరో రెండు టీమ్‌లు మధ్యలో రిటైర్డ్ హర్ట్ అయ్యాయి. ఒకటి తెలుగు దేశం. రెండు షర్మిల పార్టీ.

ఈ రెండూ కాంగ్రెస్‌కు లోపాయికారీ మద్దతు ఇస్తూ ఆట నుంచి వైదొలిగినట్లు జనం చెప్పుకుంటున్నారు. షర్మిల అయితే, ఆ విషయం ఓపెన్‌గానే చెప్పింది. "నా వల్ల కాదు" అని. ఆ విషయాన్ని ఆమె తెలంగాణ రాజకీయాల్లో వేలు పెట్టినప్పుడే చాలామంది చెప్పారు. ఎప్పటికైనా, రాజకీయాలలో నోరు పారేసుకోవాలి అనుకుంటే ఆంధ్రలోనే ఆ పని చేయాలి తప్ప, తెలంగాణలో కుదరదు. టీడీపీ ఎందుకు పోటీ చేయడం లేదో చంద్రబాబు చెప్పలేదు. నిజానికి, హైదరాబాద్‌లో ఐటీ అభివృద్ధి చేసింది చంద్రబాబు. తెలుగుదేశం పార్టీ పుట్టింది హైదరాబాద్. చంద్రబాబు నివాసం హైదరాబాద్. ఆంధ్ర సెటిలర్స్ పెద్ద సంఖ్యలో ఉన్నది హైదరాబాద్. టీడీపీ మిత్రపక్షమైన జనసేన స్థావరం హైదరాబాద్.

ఆంధ్ర సెటిలర్స్‌లో అత్యధిక భాగమైన కమ్మ సామాజిక వర్గంలో తెలుగు దేశం అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నది హైదరాబాద్.

చంద్రబాబుని అమితంగా అభిమానించే సినిమా పరిశ్రమ ముఖ్యులు ఉండేది హైదరాబాద్. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, ఖమ్మం ఉమ్మడి జిల్లా, నిజామాబాద్‌లో టీడీపీ... కళ్ళు మూసుకుని 40 స్థానాలు, దాని మిత్ర పక్షంగా జనసేన ఓ ఇరవై స్థానాలలో పోటీచేసి ఉంటే రాజకీయం రక్తి కట్టి ఉండేది. పవన్ కళ్యాణ్‌ని బీజేపీ 'ధృత రాష్ట్ర కౌగిలి' నుంచి కాపాడి ఉండేవారు. అప్పుడు రాజకీయాలు వేరుగా ఉండేవి. అయినప్పటికీ ఆయన తెలుగుదేశంను కేవలం ఆంధ్రప్రదేశ్‌కు పరిమితం చేసేశారు. తెలంగాణలో పోటీ చేయకూడదు అని నిర్ణయించుకోడానికి ఆయన లాజిక్కు ఏదో ఆయనకు ఉండే ఉంటుంది. అదేమిటో మనకు తెలియదు.

దీంతో, ఫైనల్ ఆటకు మూడు జట్లులే మైదానంలో మిగిలాయి.

కాంగ్రెస్ జట్టుకు 'మాటల పుట్ట' రేవంత్‌రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. మంచి బ్యాట్స్‌మ్యానే. అయితే, ఆయన వేరే టీమ్‌లోనుంచి వచ్చిపడి, మా టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించడం ఏంటి? మేము లేమా అంటూ సీనియర్ ప్లేయర్స్ బాగా అఫెండ్ అయ్యారు... అవుతున్నారు. ముందు ముందూ అవుతూనే ఉంటారు. అందువల్ల, వాళ్ళు రేవంత్‌రెడ్డి లీడర్‌షిప్‌కు పైకి కనిపించకుండానే గోతులు తవ్వించే అవకాశం లేకపోలేదు. ఆ విద్యలో రేవంత్‌రెడ్డి తక్కువ తినేవాడు కాదు కాబట్టి ఆయనా అదే పనిలో ఉంటాడు.

ఇక, రేవంత్‌రెడ్డి 'మినీ కేసీఆర్' లాంటి వారు. రాజకీయంగా కేసీఆర్ దగ్గర ఎన్ని విద్యలు ఉన్నాయో... అవన్నీ రేవంత్‌రెడ్డి దగ్గరా ఉన్నాయి. అయితే, రేవంత్‌కు వరస కుదరడం లేదు.

అందువల్లనే, అన్నీ ఏక కాలంలో.. అంటే, బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ చేయగలరా అనే సందేహాలను చాలామంది కామెంటేటర్లు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందేహాలకు మరో బలమైన కారణం లేకపోలేదు.

తెలంగాణలో పునరుజ్జీవింపచేసి.... కార్యకర్తలు, అభిమానులు బలంతో... కనీసం 30 నియోజకవర్గాలలో సత్తా చాటగలిగిన 'తెలుగుదేశం' పార్టీ, ఆట మధ్యలో కాడి పారేయడం కూడా కాంగ్రెస్‌కు లాభించే చర్య అనే విశ్లేషణలు విస్తృతంగా వెలువడుతున్నాయి. అయితే, చంద్రబాబు వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందోనన్న సందేహాలు కూడా గట్టిగానే ఉన్నాయి.

నిజానికి, 2018 ఎన్నికల్లో.... తెలంగాణలో కాంగ్రెస్ గెలవాల్సింది. అది గెలుస్తుందనే నమ్మకం కూడా తనకు కలిగిన తరువాత... 'టీఆర్ఎస్‌ను ఓడించే వరకు గెడ్డం గీయను' అని అప్పటి కాంగ్రెస్ టీమ్ కెప్టెన్ ఉత్తమకుమార్‌రెడ్డి భీషణ ప్రతిజ్ఞ చేశారు. అటువంటి రాజకీయ వాతావరణం కూడా అప్పుడు కనిపించింది.






టీఆర్ఎస్ టీమ్‌కు 15-20 సీట్లు మాత్రమే లభించే అవకాశం ఉందని... రాజకీయ విశ్లేషకుడిగా విశేష గుర్తింపు పొందిన సీ.నరసింహారావు అంచనా వేశారు కూడా.

ఈ దశలో తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలంగాణ రంగ ప్రవేశం చేశారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి రోడ్‌షోలు, బహిరంగ సభలు, ర్యాలీల్లో వేదికలు పంచుకున్నారు.

ఆ ఒక్క కారణం సరిపోయింది, టీఆర్ఎస్ అప్పుడు గెలవడానికి. చంద్రబాబు పట్ల మనసులో అభిమానం ఉన్నవారు తెలంగాణలో లక్షల సంఖ్యలో ఉన్నప్పటికీ 'తెలంగాణ సెంటిమెంట్'ను బాగా రంగరించి, గుళికలు... సిరప్... క్యాప్సూల్స్ రూపంలో జనానికి పట్టించడంలో సిద్ధహస్తులైన టీఆర్ఎస్ నేతలు, చంద్రబాబునాయుడును తెలంగాణ వరకు 'అంటరాని' నేతగా చూపించడంలో ఘన విజయం సాధించారు.

టీఆర్ఎస్ ఎవరూ ఊహించని విజయం సాధించింది. విశ్లేషకులు అందరూ షాక్ అయ్యారు. కాంగ్రెస్ నేత ఉత్తమకుమార్‌రెడ్డి గెడ్డం అయితే ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

ఈసారి దానికి మోక్షం కలుగుతుందని అనిపించడం లేదు. కాంగ్రెస్‌కు లాభం చేకూర్చడానికే తెలుగుదేశం ఎన్నికల బరిలోంచి తప్పుకుందనే ప్రచారం కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చుతుందనే వ్యాఖ్యానాలు వినబడుతున్నాయి. ఆ ప్రచారం చాలు బీఆర్ఎస్ గెలవడానికి అనే వాదన కూడా గట్టిగానే ఉంది. అయితే, కాంగ్రెస్ మాత్రం ఒక బలమైన టీమ్‌గా బరిలోకి దిగింది అనడంలో సందేహం లేదు.

ఇక, బీజేపీ టీమ్ కూడా... 'తెలంగాణ కప్పు' ఫైనల్స్‌లో పోటీ చేస్తోంది. దీనికి ఆటగాళ్ళ బలం కంటే.. ఈలలు, చప్పట్లతో బయటి నుంచి అల్లరల్లరి చేసేవారు ఎక్కువ. ఢిల్లీ, ఇతర రాష్ట్రాల నుంచి గుంపులు గుంపులుగా పొద్దుట పూట వచ్చి... అల్లరల్లరి చేసి, సాయంత్రానికి ఎయిర్‌పోర్టుకు వెళ్ళేవారిని చూపి, బీజేపీ మాంచి ఊపు మీద ఉంది అనే భావన కల్పించడానికి బీజేపీ నేతలు నానా తంటాలు పడుతున్నారు. ఇదొక మైండ్ గేమ్.

దీనికితోడు, టీమ్ కెప్టెన్ బాగా వీక్ అనే భావన జనంలోకి గట్టిగా వెళ్ళింది.

సీనియర్ ప్లేయరే గానీ, కిషన్‌రెడ్డి మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ అయితే బాగా రాణిస్తారు, సచిన్ టెండూల్కర్ లాగా అని పరిశీలకులు అంటుంటారు. సచిన్ కూడా కెప్టెన్‌గా వీర ఫెయిల్యూర్. కానీ, మిడిల్ ఆర్డర్‌లో టాప్ అంటారు కదా! కిషన్‌రెడ్డి పరిస్థితీ అదే.

దీనికి తోడు, బీజేపీ టీమ్‌లో ఆటగాళ్ళను వేరే టీమ్‌లలో నుంచి భారీ ఆఫర్లతో తెచ్చుకోవాల్సి వచ్చింది.

కాకపోతే, బయటి ఆటగాళ్ళు... మెల్లగా జారుకుంటున్నారు. మొదటి నుంచీ బీజేపీలో ఉన్నవారే చివరకు అందులో మిగిలినా ఆశ్చర్యం లేదు.

నిజానికి, ఆంధ్రలో బీజేపీని మంచి చేసుకోవాలని భావిస్తున్న టీడీపీ, తెలంగాణలో ఔట్ రైట్‌గా బీజేపీకి మద్దతు ప్రకటించి ఉండాల్సిందనే అభిప్రాయం ఒకటి ఉంది.

అలా ప్రకటించినప్పటికీ, తెలంగాణలోని టీడీపీ అభిమాన ఆంధ్ర సెటిలర్లు బీజేపీని దగ్గరకు రానిచ్చేవారు కాదు. కానీ, ఢిల్లీ ప్రభువుల దృష్టిలో ఆయన 'సేఫ్'గా ఉండేవారన్న అభిప్రాయం ఒకటి పరిశీలకులలో ఉంది.

ఇప్పటికైనా చంద్రబాబు తరపున లోకేష్ వంటి పార్టీ ముఖ్యులు 'నష్ట నివారణ' చర్యలకు దిగుతారేమో చూడాలి.

తెలంగాణలోని తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు బీజేపీ - జనసేన కూటమికి మద్దతు ఇవ్వాలి అని లోకేష్ లాంటి ముఖ్యనేతలు పిలుపు ఇస్తే.. ఆంధ్రలో కూడా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి మార్గం సుగమం అవుతుంది. తెలంగాణలో టీడీపీ మౌనం బీఆర్ఎస్‌కు మళ్ళీ అయాచిత వరం.

దీనికి తోడు, షర్మిల సైతం తెల్ల జెండా ఎగరేయడం తెలంగాణ రాజకీయాల్లో జనాలను ఆశ్చర్యచకితుల్ని చేసింది.

తెలంగాణలో అధికారంలోకి రావడానికి, కాంగ్రెస్ ఇంకో టర్మ్ ఆగాలి అనిపిస్తోంది.

బీఆర్ఎస్‌కు సంబంధించి... కేటీఆర్, హరీష్‌రావు ముఖ్యం. ముఖ్యాతి ముఖ్యం. కానీ, కేసీఆర్ లేకుండా వారు లేరు. అయితే, వారు లేకుండా కేసీఆర్ కూడా లేరు.

- భోగాది వేంకట రాయుడు
శాన్‌ఫ్రాన్సిస్కో నుండి...
medhomadhanam@gmail.com

# పవన్ చెవిలో.. 'కమలం' పువ్వు

(మొదటి పేజీ తరువాయి)

కూడా కాపులు ఎక్కువగా నివసించే కూకట్‌పల్లితో పాటు, ఖమ్మం జిల్లాలో నాలుగైదు స్థానాల నుంచి జనసేన పోటీ చేయబోతోంది. 119 స్థానాలు కలిగిన తెలంగాణలో 8 స్థానాలలో పోటీచేయ డానికి మాత్రమే పవన్ పరిమితమయ్యారు. హీరోగా అయన ఆంధ్రలో ఎంత పాపులరో... తెలంగాణలోనూ అంతే పాపులర్ అని ఆయన అభిమానులు చెప్తుంటారు. దీనికితోడు 'మెగా ఫ్యామిలీ' అనే టైటిల్ కూడా ఉంది. నిజానికి, ఆ కుటుంబానికి ఉన్న పాపులారిటీకి రెండు రాష్ట్రాల్లోని మొత్తం అసెంబ్లీ స్థానాలకు పవన్ కళ్యాణ్ పార్టీ పోటీ చేయవచ్చు. కానీ, తెలంగాణలో 119 సీట్లకిగానూ 8కే సరిపెట్టుకున్నారు.

రాజకీయాలలో పదేళ్లుగా ఉన్న ఒక ప్రాంతీయ పార్టీ 119 స్థానాలు కలిగిన తెలంగాణ రాష్ట్రంలో కేవలం 8 స్థానాల లోనే పోటీ చేస్తుంటే, ఇక 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు నియోజకవర్గాలు కలిగిన ఆంధ్రలో పవన్ ఎన్ని స్థానాలకు పోటీ చేయగలరన్నది ఇప్పుడు రాజకీయ వర్గాలలో నడుస్తున్న చర్చ. ఆ నిష్పత్తిలో చూసుకుంటే, 12 లేదా 13 స్థానాలతో ఆయన సరిపెట్టుకోవచ్చన్న అభిప్రాయం కూడా చాలామంది నుండి వ్యక్తమవుతోంది. ఆయన పార్టీలో అంతటి 'సమర్థులైన' అభ్యర్థులు కూడా కుడీ ఎడంగా ఇంతకిమించి కనిపించడం లేదని కూడా రాజకీయవర్గాలు వ్యాఖ్యనిస్తున్నాయి. చంద్రబాబు ఈ అంశాన్నే గట్టిగా పట్టుకుని సాగదీసి బేరం చేసే అవకాశం ఉందని కూడా జనసేన వర్గాలు తమ అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

ఆంధ్రలో జనసేన, టీడీపీ కూటమితో బీజేపీ చేతులు కలపాలని పట్టుబడుతున్న పవన్ కళ్యాణ్ తెలంగాణలో టీడీపీని గాలికి వదిలేశారు. టీడీపీని కూడా కలుపుకుంటేనే... బీజేపీతో కలిసి పోటీచేస్తానని ఆయన పట్టు పట్టకపోవడం విడ్డూరం అంటున్నారు విశ్లేషకులు. పవన్ కళ్యాణ్‌కు ఒక స్థిరమైన రాజకీయ సిద్ధాంతం లేదన్న విషయం ఈ తికమకల పొత్తులతో స్పష్టమైపోతోంది. ఆంధ్ర ఎన్నికల కంటే, తెలంగాణ ఎన్నికలు ముందుగా వచ్చేసిన నేపథ్యంలో, తెలంగాణలో పవన్ కళ్యాణ్ 'బలం' అంచనా వేయడానికి కూడా ఈ ఎన్నికల ఫలితాలు ఉపయోగపడతాయి.

జనసేన ఈ ఎనిమిది నియోజకవర్గాలలో ఎన్ని గెలుస్తుంది, ఓట్ షేర్ ఎంత లభిస్తుంది, బీజేపీకి ఎన్ని సీట్లు వస్తాయి, బీజేపీ ఓటింగ్‌లో పవన్ కళ్యాణ్ ప్రభావం ఎంత, ఇలాంటి అనేక సంశయాలకు సమాధానాలు దొరుకుతాయి.

అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్‌కు మధ్యలో జనసేన తేలిపోయినట్టుగా కనిపిస్తే, ఆంధ్రలో సైతం ఆ ఫలితాల ప్రభావం పవన్ పార్టీపై గణనీయంగా పడే 'ప్రమాదం' లేకపోలేదు.

ఆంధ్రలో ఎన్నికలు కళ్లెదురుగా పెట్టుకుని, తెలంగాణలో బీజేపీ వేసిన ముష్టి 8 స్థానాలకి ఆశ పడకుండా, తాము ఎక్కడా పోటీ చేయబోమని, తమ మద్దతు బీజేపీకి ఉంటుందని ప్రకటించి (షర్మిల కాంగ్రెస్‌పార్టీకి మద్దతు ప్రకటించినట్లుగా) ప్రధాని, అమిత్‌షా వంటి నాయకుల సభలలో పాల్గొనడం వరకే పవన్ కళ్యాణ్ పరిమితమై ఉండుంటే, గుప్పిట మూసినట్లుగా జనసేన గుట్టు గుట్టుగానే ఉండేదని, అనవసరంగా పోటీచేసి తమ పరువు తామే పోగొట్టుకునే పరిస్థితికి తెరలేపుకుంటున్నామనే విమర్శ కూడా ఆ పార్టీ వర్గాల నుండే వినిపిస్తోంది. ఒకవేళ ఇప్పుడు, పోటీ చేస్తున్న 8 నియోజకవర్గాల్లో ఒకటో, రెండో గెలిచినా, ఫలితాల తరువాత వారు పవన్ కళ్యాణ్ అదుపులో ఉండడం కష్టమేనన్నది కూడా పార్టీ శ్రేణుల అభిప్రాయం. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి బీఆర్ఎస్‌కు ఏమాత్రం సీట్లు తక్కువైనా, వాళ్ళ కళ్ళు ముందుగా పవన్ పార్టీ విజేతలపై పడుతుందని, పవన్ కళ్యాణ్‌కు మరోసారి రాజోలు అనుభవమే ఎదురు కావచ్చని కూడా కొందరు జనసేన నాయకులు భయపడుతున్నారు.

జరుగుతున్న పరిణామాలు క్షుణ్ణంగా గమనిస్తే బీజేపీ ట్రాప్‌లో పవన్ కళ్యాణ్ పడ్డాడని కూడా విశ్లేషకులు అంటున్నారు. తెలంగాణలో పవన్ జీరో అయితే, దానిని సాకుగా చూపించి నీకు ఎక్కడా పెద్ద సీను లేదు, కాబట్టి మాతో ఉంటే ఉండు లేదంటే తెగతెంపులు చేసుకుని టీడీపీతో పో..! అని చెప్పడం ఒక ఎత్తైతే, ఒకవేళ పవన్ వల్ల ఆ పార్టీకి లాభం కలిగితే, ఆంధ్రాలో జనసేన వల్ల టీడీపీకి ఒనగూరే లాభాన్ని అంచనా వేయడం మరో ఎత్తు. ఏదిఏమైనా తెలుగు రాష్ట్రాల్లో తమ రాజకీయ భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని పవన్‌ని పావులా కమలం పార్టీ వాడుతోందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. గత ఎన్నికలలో స్వయంగా తానే ఓడిపోయి చేదు అనుభవం ఎదురైనా పవన్ జంకలేదు. పట్టు వదలని విక్రమార్కుడిలా పోరాడుతూనే ఉన్నారు. బహుశా తక్షణం తెలంగాణ, ఆ తరువాత ఆంధ్ర ఈ రెండు ఎన్నికలు జనసేనానికి శీలపరీక్ష లాంటివి. ఈసారి కూడా గతానుభవమే ఎదురైతే పవన్ రాజకీయాలలో చాప చుట్టేసి సినిమాలకే పరిమితం కావడం మంచిది. ఆయన ఎప్పటికీ కింగ్ కాలేరన్నది మాత్రం ఎవరూ కాదనలేని వాస్తవం. ఈసారి కనీసం కింగ్ మేకర్ అయినా అవుతారా లేక కేవలం పొలిటికల్ కమెడియన్‌లా మిగిలిపోతారా అన్నది వేచిచూడాలి!

## ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు.. విఎస్‌యు వీసీ అభినందన



ఢిల్లీలో ఇటీవల జాతీయస్థాయిలో జరిగిన 'నా మట్టి-నా దేశం' కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) ఉపకులపతి ఆచార్య జీఎం సుందరవల్లి అభినందించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఢిల్లీలో ముగింపు వేడుకలు నిర్వహించారు. నెల్లూరుజిల్లా నుంచి 54మంది పాల్గొనగా, అందులో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుంచి 16 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొనడం విశేషం. జిల్లాలోని వివిధ మండలాల నుంచి సేకరించిన మట్టిని, ధాన్యాన్ని అమృత కలశాలలో నింపి ఢిల్లీలోని అమృతవాటికలో మొక్కలు నాటడానికి వాడడటం వంటి మహత్తర కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొనేందుకు అవకాశం కల్పించిన నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ అధికారి డా. మహేంద్రరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా. ఉదయ్‌శంకర్ అల్లం, డా.కే.సునీత తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయొద్దు

### - విద్యార్థి సంఘాల ఆందోళన



విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరులో ఈనెల 8న చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యాసంఘాల వారు రాస్తారోకో చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కును కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణకు తలపెట్టడం దారుణమని, ఫ్యాక్టరీకి అనుబంధంగా గనులు కేటాయించకపోవడం అన్యాయమని అన్నారు. ఎంతోమందికి ఉపాధి చూపుతున్న ఈ పరిశ్రమను ప్రైవేట్‌పరం చేయడాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, పవన్‌కిశోర్, ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ నాయకులు శివ, ఆకాష్, సూర్య, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## వింజమూరులో పంటలను పరిశీలించిన అధికారులు

వింజమూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల జిల్లా వ్యవసాయాధికారి సిహెచ్ సుధాకర్‌రాజు పర్యటించి కంది, మినుము పంటలను పరిశీలించారు. రైతులు తమ పంటల వివరాలను, వర్షాలు లేక ఎండిపోతున్న పంటల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఏడీఏలు రామిరెడ్డి, నర్సోజీరావు, ఏఓ శివనాగప్రసాద్ పాల్గొన్నారు.

## బీసీల అభ్యున్నతి కోసం.. ఐక్యపోరాటం చేస్తాం

### --- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ---



రాష్ట్రంలో బీసీల అభ్యున్నతిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో 'బీసీలకు ప్రభుత్వ నమ్మకద్రోహంపై ఐక్యపోరాటం' చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర చెప్పారు. ఈనెల 8న ఆయన నెల్లూరులోని తన నివాసంలో బీసీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీలకు జరుగుతున్న అన్యాయం, ప్రభుత్వ కక్షసాధింపుల పట్ల బీసీల్లో చైతన్యం కలిగించేందుకు ఈనెల 17న నెల్లూరులో బీసీ నేతలతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జడ్ శివప్రసాద్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, ముదిరాజ్ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పీఎల్ రావు, నాయకులు కొండూరు పోలిశెట్టి, అన్నం దయాకర్‌గౌడ్, శ్రీపతిబాబు, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ల ఐక్యవేదిక సమావేశం



నెల్లూరు బీవీనగర్‌లో ఉన్న సంఘమిత్ర విద్యాలయంలో ఇటీవల రెడ్ల ఐక్యవేదిక సమావేశం జరిగింది. నిర్మల నరసింహా రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, సంఘమిత్ర స్కూల్ అధినేత రవీంద్రరెడ్డి, బీవీరెడ్డి, చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రెడ్ల అభ్యున్నతి విషయమై చర్చించారు. గూడూరు, తిరుపతి, కావలి, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాలకు చెందిన రెడ్డి సంఘాల అధ్యక్షులు, సభ్యులు మొత్తంగా సుమారు 6వందల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ భవన నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు ప్రకటించారు. అనంతరం 'అమ్మా షాపింగ్‌మాల్' అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి తదితరులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

## 100వ సారి..అజయ్‌బాబు రక్తదానం



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ-నెల్లూరుజిల్లా శాఖ బ్లడ్ సెంటర్ కన్వీనర్, ఉపాధ్యాయుడు సిహెచ్. అజయ్‌బాబు ఈనెల 8న 100వ సారి రక్తదానం చేసి అందరి అభినందనలు అందుకున్నారు. ఉపాధ్యాయుల్లో ఇప్పటివరకు 100 సార్లు రక్తదానం చేసిన మొదటివ్యక్తి అజయ్‌బాబు అంటూ రెడ్‌క్రాస్ ఛైర్మన్, శాసన మండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కొనియాడుతూ, ఆయన్ను శాలువాతో సన్మానించారు. రక్తదానమంటే ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలని ఈ సందర్భంగా పర్వతరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కన్వీనర్లు యు.మురళీకృష్ణ, అరిగెల సాయిరాం, పి.లోకేష్, రెడ్ క్రాస్ సభ్యులు సీహెచ్ సరితారాణి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ ప్రసన్న వేంకటేశ్వరునికి..

## రూ. 3 లక్షల లక్ష్మీకాసుల హారం



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రవాసభారతీయుడు ఓబిలిశెట్టి బాబూరావు-నాగమణి దంపతులు ఇటీవల మూడు లక్షల రూపాయల విలువచేసే లక్ష్మీకాసుల హారాన్ని బహూకరించారు. కావలిలో ఉన్న ఆ దాతల ప్రతినిధులు పేకేటి శ్రీనివాసులు-రాజ్యలక్ష్మి కుటుంబసభ్యులు ఆ హారాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ అధికారులకు అందజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో గరుడోత్సవం రోజున ఈ హారాన్ని అలంకరిస్తామని ఆలయ ఛైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి చెప్పారు. ఆలయ ఇఓ రాధాకృష్ణ, ట్రస్టు సభ్యులు ఓబులురెడ్డి, రాంబాబు, మాల్యాద్రి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



## 10 నుంచి..
# 'చెకుముకి' సైన్స్ సంబరాలు

జనవిజ్ఞానవేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో నవంబరు 10వ తేది నుంచి 'చెకుముకి' సైన్స్ సంబరాలు నిర్వహించనున్నారు. ఆమేరకు ఈనెల 5న కావలిలోని రవి నర్సింగ్‌హోమ్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించేందుకు జనవిజ్ఞానవేదిక ఎంతగానో కృషిచేస్తోందని, సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని, సరైన అవగాహనను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నాలుగు స్థాయిలో నిర్వహించనున్న ఈ సంబరాల్లో 10వ తేదీన పాఠశాల స్థాయిలోనూ, 30న మండల-పట్టణ స్థాయిలోను, డిసెంబరు 17న జిల్లా స్థాయిలోనూ, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయిలోనూ సైన్స్‌కు సంబంధించిన పలు అంశాలపై పోటీలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, టి.సుబ్బారాయశర్మ, జానకిరామ్, కల్యాణి, వెంకయ్య, ఖాదర్‌బాషా, సి.శారద, కల్లయ్య, హజరత్తయ్య రమణయ్య, ఎస్కే జమీర్, ఖాదర్‌బీ, ఎంవిఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



నెల్లూరులోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం యువ సేవాదళ్ సభ్యులు ఇటీవల సుమారు 6 వందల మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. వర్షాలతో చలికి వణికిపోతున్న వృద్ధులకు, యాచకులకు, అనాథలకు వాటిని అందజేశారు. శ్రీ షిర్డీ సాయినాథుని 105వ మహాసమాధి ఉత్సవాల సందర్భంగా నగరంలోని పలుప్రాంతాల్లో నిరుపేదలకు ఈ సేవ చేపట్టామని, గత పన్నెండేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అద్దాలమందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు.

# శ్రీసిటీని సందర్శించిన.. ఏపీఇఐటీఏ సీఈఓ



ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ (ఏపీఇఐటీఏ) గ్రూప్ సీఈఓ కిరణ్ సలికిరెడ్డి, తమ అధికారుల బృందంతో కలిసి ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి, సెజ్, డీటీజెడ్, వేర్ హౌసింగ్ జోన్(ఎఫ్‌టీడబ్ల్యుజెడ్), ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఇఎంసీ) లతో శ్రీసిటీ పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలోని వివిధ అంశాల గురించి తెలుసుకునేందుకు ఆసక్తి కనబరిచిన కిరణ్, ముఖ్యంగా ఎలక్ట్రానిక్ క్లస్టర్ పనితీరు, అక్కడ పరిశ్రమల గురించి ఆరా తీశారు. శ్రీసిటీ అధికారులతో చర్చల అనంతరం పారిశ్రామికవాడ పరిసరాలను పరిశీలించారు. బ్లూస్టార్, డైకిన్ ఇండియా పరిశ్రమలను సందర్శించి, మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలపై అభిప్రాయ సేకరణకు సంబంధించి ఆయా కంపెనీల సీనియర్ మేనేజర్లతో చర్చించారు. శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాల పట్ల ఈ సందర్భంగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. భారీ ఉపాధి అవకాశాల సృష్టితో మెగా ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధికి కృషి చేసిన శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు. శ్రీసిటీ మరింత అభివృద్ధికి కిరణ్ పరిశీలనలు, సూచనలు చాలా విలువైనవిగా తాను భావిస్తున్నట్లు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు.

# సీపీఎస్ఇఏ జిల్లా శాఖ కార్యవర్గం ఎన్నిక



ఏపీ సీపీఎస్ఇఏ (సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్) జిల్లాశాఖ కార్యవర్గాన్ని ఇటీవల నెల్లూరులో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ధనరాజ్, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ పెంచలయ్య, ఆర్థిక కార్యదర్శిగా పవన్‌కుమార్, సహాధ్యక్షులుగా జగదీష్‌కుమార్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా ఆషియా బేగం, రాష్ట్ర కౌన్సిల్‌మెంబర్స్‌గా ఎం.హరి, ఎం.రమేష్, ఏ.ప్రభాకర్, డి.సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నిర్వాహకులు తెలిపారు. వారితోపాటు ఉపాధ్యక్షులుగా మరొక పదిమందిని, కార్యదర్శి వర్గంగా మరో పదిమందిని కూడా ఎన్నుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్, సీపీఎస్ విధానాలు కాకుండా ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కొత్త కమిటీ కార్యవర్గ నాయకులు డిమాండ్ చేశారు. నవంబర్ 19వ తేదీన చిత్తూరు జిల్లాలో జరిగే సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభలో నెల్లూరు జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## టూకీగా...

### సంగంలో బీఎల్ఓలతో ఆర్డీఓ సమావేశం

సంగం తహశీల్దార్ కార్యాలయంలో ఇటీవల ఆత్మకూరు ఆర్డీఓ మధులత బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, ఓటు నమోదు పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. తహశీల్దార్ నాగరాజు, డెప్యూటీ తహశీల్దార్లు ప్రవీణ్‌కుమార్, అశోక్‌కుమార్, ఆర్ఐ రాజ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### బోగోలులో రైతులకు శిక్షణా కార్యక్రమాలు

బోగోలు మండలంలోని బోగోలు, నాగులవరం, కోవూరుపల్లి రైతులకు ఇటీవల రైతు భరోసా కేంద్రాల వద్ద వ్యవసాయ శాఖ ఏడీఏ జి.లక్ష్మీమాధవి, బిఏస్ చక్రవర్తి, గీతామాధురి, మధురిమలు రైతులకు శిక్షణ ఇచ్చారు. వర్షాలు ఆలస్యం అవుతుండడం వల్ల రైతులు వరికి బదులు ఇతర పంటలు వేసుకోవాలని సూచించారు. సస్యరక్షణ పట్ల అవగాహన కలిగించారు.

### కొత్తపల్లిలో సచివాలయం రికార్డుల పరిశీలన


అనంతసాగరం మండలంలోని కొత్తపల్లి సచివాలయంలో ఇటీవల మండల అభివృద్ధి అధికారి ఏ. మధుసూదన్‌రావు ఆకస్మికంగా తనిఖీలుచేసి రికార్డులు పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించడంలో సిబ్బంది తీసుకుంటున్న చర్యలను ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి జునైద్ అహ్మద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


### వరికుంటపాడులో ఇళ్ళనిర్మాణాల తనిఖీ

వరికుంటపాడులో జరుగుతున్న గృహనిర్మాణాలను ఇటీవల ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంగవరప్రసాద్ తనిఖీ చేశారు. నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. ఇళ్లు కావాలంటూ మరికొందరు పేదలు కొత్తగా అర్జీలిచ్చారని, వాటిని కూడా పరిశీలించి అర్హులందరికీ ఇళ్ళు కేటాయిస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

### మనుబోలు విష్ణాలయానికి వెండి శఠారి బహుకరణ

మండల కేంద్రమైన మనుబోలులో ఉన్న శ్రీ మహావిష్ణు దేవాలయానికి అదే ప్రాంతానికి చెందిన చల్లా రామయ్య-మస్తానమ్మ దంపతులు ఇటీవల వెండి శఠారిని బహుకరించారు. ఆలయ అర్చకుడు హనుమాచార్యులు దాతలకు దైవదర్శనం చేయించి ఆశీర్వదించారు.

# సూర్యకాంతం నటనా వైభవం.. అద్వితీయం

## శతజయంతి వేడుకల్లో పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య ప్రశంస




అలనాటి మేటి నటీమణి సూర్యకాంతం నటనా వైభవం అద్వితీయమని భారత పూర్వ ఉప రాష్ట్రపతి, మన నెల్లూరీయులు వెంకయ్యనాయుడు కొనియాడారు. తెలుగోళ్లంతా అభిమానించే 'తెలుగింటి అత్తగారు' సూర్యకాంతం శతజయంతి ఏడాది ప్రారంభం సందర్భంగా, తెలుగు తెరపై ఏళ్ళ తరబడి ఒకే తరహా పాత్రకు ప్రాణ ప్రతిష్ట చేసి, ప్రేక్షకుల నీరాజనాలు అందుకున్న ఆమె నటనా వైదుష్యం అద్భుతమంటూ ఆయన సూర్యకాంతం స్మృతికి నివాళులర్పించారు. సూర్యకాంతం సహజ నటి అని, ఆమె గురించి ఆమె నటించిన పాత్రలే మాట్లాడతాయన్నారు. ఆమె పేరులోని సూర్యకాంతి ఆమె నటనలో ప్రకాశిస్తే, ఆ కాంతిలోని వేడి–వాడి ఆమె మాటల్లో ప్రస్ఫుటమౌతాయని, బహుముఖ ప్రజ్ఞ కలిగిన ఆమెకు మరో ప్రత్యామ్నాయం లేదని అన్నారు. ఆమెను అనుకరించడం కూడా ఎంతో కష్టమన్నారు. కొన్నిసార్లు సూర్యకాంతానికి మాటలు రాసే అవసరం కూడా రచయితలకు ఉండేది కాదని, ఆమె ఒక్కసారి ఎడమచేయి ఊపుతూ గదమాయిస్తే చాలు.. ఆ సహజనటనా చాతుర్యానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టేవారని ఆయన అన్నారు. ముఖ్యంగా, గయ్యాళి పాత్రల్లో ప్రేక్షకాభిమానం సంపాదించుకున్న సూర్యకాంతం నిజజీవితంలో ఎంతో మంచివారని, నలుగురికీ అన్నం పెట్టడం అంటే ఆమెకెంతో ఇష్టమని, అదేవిధంగా గుప్తదానాలు చేయడం, అవసరాల్లో ఉన్న వారికి సాయం చెయ్యటం, సొంత ఊరిని మరువకపోవటం వంటివి ఆమె నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవలసిన ఆదర్శాలని ఆయన అన్నారు. ఆమె మహిళానటి అయినా కూడా, కఠినమైన మనస్తత్వం ఉన్న పాత్రల్లో నటించడం గొప్ప విషయమన్నారు. శతజయంతి సందర్భంగా ఆమె కుమారుడు అనంత పద్మనాభమూర్తి ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో 'తెలుగింటి అత్తగారు' అనే పుస్తకాన్ని విడుదల చేయటం ఆనందదాయకమని, ఈ పుస్తకం ఆమె నటనా వైభవాన్ని తెలియజేసే కరదీపిక అవుతుందని అన్నారు. మహాకవి శ్రీశ్రీ కుమార్తె, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.మాల, సినీనిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, విజయా ప్రొడక్షన్స్ నిర్వాహకులు కె.విశ్వనాథరెడ్డి, సినీకవి భువనచంద్ర, ఆస్కా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ప్రముఖ ఆర్కిటెక్ట్ ఆదిశేషయ్య, గోపురం సంస్థ అధినేత హరికృష్ణ, ప్రముఖ నటీమణులు రాజశ్రీ, జయచిత్ర, ప్రభారమేష్ తదితరులు పాల్గొన్నారు.










## పంచమ వర్ధంతి

ప్రేమాభిమానాలకు ప్రతీకగా నిలచి
మమతానురాగాలకు ప్రతిరూపంగా వెలసి
మా అందరికీ ఆత్మీయత పంచిన మానవీయ దీప్తి

**శ్రీమతి పులి స్వరూపరెడ్డి గారు**

మాకు దూరమై **ఐదు సంవత్సరాలు** గడుస్తున్నా,
ఆమె చిరునవ్వులు మా గుండెల్లో పదిలంగా ఉన్నాయి.
ఆ మహనీయమూర్తి
**పంచమ వర్ధంతి** సందర్భంగా
**ఆమెకు శ్రద్ధాంజలి ఘటిస్తూ...**

**తల్లి: కాటంరెడ్డి నవనీతమ్మ**
**భర్త: పులి అశోక్‌రెడ్డి**
**కుమారుడు: పులి చరణ్‌రెడ్డి**
**కుమార్తె - అల్లుడు**
**వల్లూరు శ్రీస్ఫూర్తి - వల్లూరు వెంకట రుత్విక్‌రెడ్డి**
**మరియు**
**కుటుంబసభ్యులు**

**Staff:**
**P.A. REDDY & CO CHARTERED ACCOUNTANTS**
**NELLORE - CHENNAI - HYDERABAD.**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com